
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 18 సెప్టెంబరు 2025



ఎయిర్‌పోర్టులో

ఘనంగా యాత్రీ సేవ

- మొక్క నాటిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- త్రిపుర గవర్నర్, కేంద్రమంత్రి పెమ్మసాని రాక
- యాత్రికులకు పలు సేవా కార్యక్రమాలు

6

అక్రమాలపై చర్యలేవ్!

గుడ్లవల్లేరు పంచాయతీలో నిధుల దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు కావాలనే జాప్యం చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఈవోలుగా, బిల్ కలెక్టర్‌గా పనిచేసిన ఉద్యోగులు సుమారు రూ.30 లక్షల వరకు అక్రమాలకు పాల్పడితే గ్రామస్థులు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణకు ఆదేశించిన జిల్లా అధికారులు విచారణ నివేదిక సమర్పణలో జరుగుతున్న జాప్యంపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ వ్యవహారం నుంచి బయట పడేందుకు అక్రమాలకు పాల్పడిన వారు తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

గుడ్లవల్లేరు పంచాయతీలో రూ. 30 లక్షలు దుర్వినియోగం!

గతంలో పనిచేసిన ఈవోలు, బిల్ కలెక్టర్ నిర్వాకం

- గ్రామస్థుల ఫిర్యాదుతో విచారణకు ఆదేశించిన జిల్లా అధికారులు
- నెలరోజులకుపైగా కొనసాగుతున్న విచారణ
- డీపీవో కార్యాలయానికి నివేదిక సమర్పించకుండా జాప్యం!
- అక్రమాలకు పాల్పడిన వారిని అధికారులే కాపాడుతున్నారని చర్చ!
- వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: గుడ్లవల్లేరు పంచాయతీకి ఇంటి పన్నులు, ఇతరత్రా పన్నుల రూపంలో ఏడాదికి రూ.80 లక్షలపైనే ఆదాయం సమకూరుతుంది. అయినా పంచాయతీలో ఒక్కపని సక్రమంగా చేయకపోవడంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామ ప్రముఖులంతా కమిటీగా ఏర్పడి పంచాయతీ నిధులను సక్రమంగా వినియోగించకపోవడం, పంచాయతీలో పనిచేసే ఉద్యోగులు చేస్తున్న అక్రమాలపైన ఆరా తీశారు. పంచాయతీలో గతంలో పనిచేసిన ఈవోలు, బిల్‌కలెక్టర్ ఇంటి పన్నులు, చెరువుల వేలం పాటలు, ఇతరత్రా పన్నుల రూపంలో వసూలు చేసిన నగదును పక్కదారి పట్టించారని గుర్తించారు. గతంలో ఇక్కడ పనిచేసి వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లిన ఉద్యోగి రికార్డులు అప్పగించకపోయినా అతన్ని ఈవో రిలీవ్ చేశారనే విషయం కూడా బయటకు వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికలు జరిగిన సమయంలో వివిధ కారణాలతో ఈ పంచాయతీకి ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో



పాలకవర్గం లేని పంచాయతీకి ప్రత్యేక అధికారులుగా గడచిన నాలుగు సంవత్సరాల్లో ఇద్దరు ఎంపీడీవోలు వ్యవహరించారు. అయినా పంచాయతీలో జరిగిన అక్రమాలను వీరు పట్టించుకోకపోవడం వెనుక కారణాలు ఏమై ఉంటాయనే అంశంపైనా గ్రామస్థులు అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. నిధులు పక్కదారి పట్టిన అంశంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

రెండు నెలల క్రితం విచారణకు ఆదేశం

గుడ్లవల్లేరు పంచాయతీలో జరిగిన అక్రమాలపై డీపీవో కార్యాలయ అధికారులు రెండు నెలల క్రితం విచారణకు ఆదేశించారు. విచారణ అధికారులు, సిబ్బందిని కూడా నియమించారు. వీరు నెలరోజుల క్రితం పంచాయతీలోని వివిధ రకాల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గ్రేడ్-1 పంచాయతీగా ఉన్న గుడ్లవల్లేరులో విచారణ అధికారులుగా గ్రేడ్ తక్కువ ఉన్న పంచాయతీ కార్యదర్శులను నియమించడంపై పంచాయతీ కార్యదర్శులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పంచాయతీలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా పక్కదారి పట్టించేందుకు తెరవెనుక పెద్దమంత్రాంగం నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకరిద్దరు అధికారులు నిధుల దుర్వినియోగం అంశాన్ని పక్కదారి పట్టించి, అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులను కాపాడే ప్రయత్నంలో భాగంగా విచారణ చేయడంలో జాప్యం చేయిస్తున్నారని పలువురు పంచాయతీ కార్యదర్శులు చెప్పుకుంటున్నారు.

పెద్ద మొత్తంలో నగదు చేతులు మారిందా!

పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకున్న విచారణ అధికారులు రెండు నెలలు అవుతున్నా ఇంకా విచారణ చేస్తున్నామని చెబుతున్నారు. ఈ విచారణలో ఆలస్యం వెనుక పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించిన ఒకరిద్దరి అధికారుల ఒత్తిడి ఉందని పంచాయతీ కార్యదర్శులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. గతంలో ఈ పంచాయతీలో పనిచేసి, అక్రమాలకు పాల్పడిన మిగతా 6లో..

స్త్రీ శక్తి @ రూ. 23.69 కోట్లు

నెల రోజుల్లో మహిళలకు ప్రభుత్వ రాయితీ

స్త్రీ శక్తి పథకం ఉమ్మడి కృష్ణా జిల్లాలో సూపర్ హిట్ అయ్యింది. తొలి నెల రోజుల్లో రికార్డు స్థాయిలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. 78,45,962 మంది ప్రయాణికులకు రూ.23.69 కోట్ల రాయితీని ప్రభుత్వం కల్పించింది. మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసే ప్రభుత్వంగా వారి మన్ననలు పొందుతోంది. అయితే మహిళల సంఖ్య భారీగా పెరగడంతో పురుషులకు కూర్చోవడానికి సీట్లు ఉండటం లేదని, చెరిసగం సీట్లు కేటాయించాలన్న డిమాండ్ మగవారి నుంచి సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 78,45,962 మంది ప్రయాణాలు

- ఎన్టీఆర్ జిల్లాలో 51,57,863 మంది ప్రయాణికులకు రూ.14.37 కోట్ల సబ్సిడీ
- కృష్ణాజిల్లాలో 26,88,099 మందికి రూ.9.31 కోట్ల రాయితీ
- స్త్రీ శక్తి పథకం అమలులో అనేక మైలురాళ్లు
- తెరపైకి సీట్లలో పురుషులకు రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): స్త్రీ శక్తి పథకం ద్వారా ఉమ్మడి కృష్ణాజిల్లాలో తొలి నెల రోజుల్లో 78,45,962 మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. మహిళలకు ప్రభుత్వం తరఫున అందించిన టికెట్ల రాయితీ విలువ మిగతా 6లో..

పురుషులకు సీట్ల రిజర్వేషన్‌పై చర్చ!

మహిళలకు రాయితీ ఇస్తున్న బస్సుల్లో వారి సంఖ్య అధికంగా ఉంటోంది. దీంతో పురుషులు బస్సుల్లో ఎక్కి ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడుతోంది. భారత హేతువాద సంఘం దీనిని విస్తృతంగా చర్చనీయాంశం చేస్తోంది. ఆ సంస్థ అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య మహిళలకు, పురుషులకు ఆర్టీసీ బస్సుల్లో చెరి సగం సీట్ల రిజర్వేషన్ ఉండాలన్న వాదన తెరపైకి తెచ్చారు. చాలా మంది పురుషులు కూర్చోవటానికి సీట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, వీరిలో సీనియర్ సిటిజన్స్ అధికంగా ఉన్నారని చెబుతున్నారు. పురుషులకు కూడా ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు.



జెట్‌సిటీలో అసంపూర్తిగా ఉన్న మొదటి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ టవర్

జెట్ వేగం

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పూర్తికి ఏపీఐఐసీ టెండర్లు

- రూ.19.55 కోట్లతో ఆరు నెలల్లో పూర్తిచేయాలని గడువు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో జెట్‌సిటీ విధ్వంసం
- కూటమి వచ్చాక అభివృద్ధికి తొలి అడుగులు
- కాంప్లెక్స్ పూర్తయితే అన్ని వర్గాలకూ ఒకేచోట పని

6

సర్వశ్రేయోదాయకం

శ్రీచక్ర నవావరణార్చన

6



విశ్వకర్మ అందరికీ ఆరాధ్య దైవం

- మంత్రి రవీంద్ర

ఉన్నత ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

- ఎన్‌పీఐబీ డీడీ అదితి అగర్వాల్

ఏటిమొగలో కలెక్టర్, ఎమ్మెల్యే స్థల పరిశీలన



సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీలో నేటి నుంచి రోబో ఎక్స్

8

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

6

సర్వశ్రేయోదాయకం శ్రీచక్ర నవావరణార్చనం





కౌంట్‌డౌన్ 4

(ఆంధ్రజ్యోతి, ఇంద్రకీలాద్రి)

శ్రీ మాతా, శ్రీ మహారాజ్ఞి లలితాపరమేశ్వరీదేవిని సంతుష్టురాలిని చేసేందుకు శ్రీ చక్రానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. అమ్మవారు శ్రీ చక్రంలో బిందు రూపంలో కొలువై ఉండగా.. నవ ఆవరణలు ఆమె చుట్టూ ఉంటాయి.. ఆ ఆవరణలకు అధిష్ఠాన దేవతలు ఉంటారు. శ్రీచక్ర పూజ చేయాలంటే దశమహా విద్యలు, అమ్మవారి ఉపాసకులకు మాత్రమే సాధ్యమవుతుంది. భక్తుల పేరిట సంకల్పం చెప్పి పూజలు నిర్వహిస్తుంటారు. శ్రీచక్ర నవావరణార్చనను సాక్షాత్తూ లక్ష్మీదేవి ప్రసన్నం కోసం పూజలు చేసినట్టుగా పురాణ కథనాలు ఉన్నాయి. ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికే జపాలు, తర్పణాలు జరుగుతాయి. అమ్మవారిని సంతుష్టురాలిని చేయటానికి శ్రీచక్ర నవావరణార్చనలో 32 ఉపచారాలు చేస్తారు. ఆవాహనం, ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనం, స్నానం, వస్త్ర సమర్పణం, యజ్ఞోపవీత సమర్పణం, ఆభరణం, గంధం, అక్షతలు, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, శ్రీముఖవాసం, నీరాజనం, దర్పణం, ఫల సమర్పణం, తాంబూలం, ప్రదక్షిణం, నమస్కారం, స్తోత్రం, పురాణపఠనం, చత్రం, చామరం, తాళవృంతం, శయ్య, సంగీతం, నృత్యం, వాద్యం, ఆత్మసమర్పణం నిర్వహిస్తారు.

25 ప్రాకార దేవతలు..

శ్రీచక్ర నగరవాసిని లలితాంబిక నివాసానికి 25 ప్రాకారాలు ఉంటాయి. ఇనుము, కంచు, రాగి, సీసం, ఇత్తడి, పంచలోహం, వెండి, బంగారం, పుష్యరాగం, పద్మరాగం, గోమేధికం, వజ్రం, వైఢూర్యం, ఇంద్రనీలం, ముక్తారత్నం, మరకతరత్నం, విద్రుమం, మాణిక్యం, వేయిస్తంభాల మంటపం, మనఃశాల మంటపం, బుద్ధిశాల మంటపం, అహంకారశాల మంటపం, సూర్యబింబశాల, చంద్రబింబ శాల, శృంగారశాల మంటప ప్రాకారాలుంటాయి. ఈ ప్రాకారాల మధ్యనే చింతామణి గృహంలో అమ్మవారు పరాభట్టారిక రూపంలో ఉంటారు. దానినే శ్రీమన్నగరం అంటారు. ఒక్కో ప్రాకారానికి అర్చన చేస్తారు. పరాభట్టారికను సేవిస్తూ ఆమె అనుగ్రహం కోసం ఎదురు చూడటం శ్రీచక్ర పూజలోని అంతరార్థం. శ్రీచక్రం చుట్టూ ఆరు చక్రాలు ఉంటాయి. ఆరు చక్రాలకు ఒక్కో విశిష్టత ఉంది. కాళి, తార, మహావిద్య, షోడశి, భువనేశ్వరి, భైరవి, చిన్నమస్తా, ధూమావతి, భగళ, మాతంగి పేరిట కొలుస్తారు. దసరా ఉత్సవాలలో అమ్మవారికి మరింత శక్తి కలగటానికి వివిధ అర్చనలు, హోమాలు చేస్తారు. మూలా నక్షత్రం నాడు అమ్మవారి పుట్టినరోజు కావటంతో ఆరోజున నవావరణార్చనకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తారు.

లక్ష కుంకుమార్చన..

ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలలో ప్రత్యేక లక్షకుంకుమార్చన నిర్వహిస్తారు. అమ్మవారికి కుంకుమ చాలా ఇష్టమైనది. కుంకుమ పూజ ఆర్థిక శ్రేయస్సును కలిగిస్తుంది. దీంతో పాటు సంతానం, శక్తి, తేజస్సుకు కుంకుమతో పూజచేసి అమ్మవారిని సంతుష్టురాలిని చేయటం ఈ పూజలో విశేషం. పసుపుతో మిళితం చేసిన కుంకుమను అమ్మవారికి సమర్పిస్తారు. లలితా సహస్రనామ పారాయణతో దుర్గమ్మవారి అనుగ్రహం కోసం ఈ పూజను చేస్తారు. వాస్తవంగా దసరా ఉత్సవాలు ముగిసేటప్పటికి లలితాసహస్రనామం లక్షసార్లు పారాయణం చేయాలనేది నియమం. అందుకనే దీనికి లక్ష కుంకుమార్చన అని పేరు. శుక్రవారం, మంగళవారాల్లో మూలా నక్షత్రం రోజున ఈ పూజ చేయటానికి భక్తులు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తారు.



ఖడ్గమాలార్చన..

అమ్మవారి సహస్రనామంతో కానీ, త్రిశతితో కాని, లేదా ఖడ్గమాలకు సంబంధించిన కొన్ని నామాలతో కాని ఈ పూజను నిర్వహిస్తారు. నవరాత్రులలో ఖడ్గ మాల పూజ చేయటం ఎంతో శ్రేష్ఠంగా భావిస్తారు. వాస్తవంగా మహిషాసురుడిని ఆమె ఖడ్గంతోనే వధించారు. ఈ ఖడ్గానికే వేయి పేర్లు ఉన్నాయి. ఈ వేయి పేర్లతోనే అర్చన చేయటం వల్ల ఎంతో శక్తి లభిస్తుందని భూత, ప్రేత, పిశాచాది భయాలు ఉండవని నమ్మిక. ఖడ్గమాలార్చనకు రూ.5,116లు రుసుము చెల్లించి ప్రతిరోజూ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటారు.

చండీహోమం..

ఐం హ్రీం క్లీం చాముండాయే విచ్చే

కనకదుర్గమ్మ అనుగ్రహం కోసం చండీ హోమం చేస్తారు. దసరా మహోత్సవాలలో అమ్మవారు శక్తిరూపంలో పూజలు అందుకుంటుంది. శక్తి పూజలతో పాటు హోమం ద్వారా ఆమె సంతుష్టురాలవుతుందని నమ్మిక. భక్తులకు శక్తిని ఇవ్వటంతో పాటు బాధల నుంచి విముక్తులను చేయటం కోసం ఈ హోమాన్ని నిర్వహిస్తారు. 'ఓం ఐం హ్రీం క్లీం చాముండాయే విచ్చే' జపంతో ఆమెను కొలుస్తారు. జీవితంలో ఎదురయ్యే కష్ట నష్టాలను, ప్రతికూల శక్తులను, చెడు ప్రభావాలను ఈ హోమం తొలగిస్తుందని నమ్మిక. పూర్వం శుంభ, నిశుంభలనే రాక్షసులను సంహరించే సమయంలో అమ్మవారు చండీ అవతారం దాల్చారని పురాణాలలో ఉంది. అమ్మవారి స్వరూపాలలో చండీదేవికి అత్యంత ప్రాధాన్యత.





వెలగపూడిలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, స్పీకర్ అయ్యన్న, హోంమంత్రి అనితలకు ఆహ్వాన పత్రికలను అందజేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్

దసరా ఉత్సవాలకు రండి..

» మంత్రులు, స్పీకర్‌కు ఆహ్వానం





ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న దసరా మహోత్సవాలకు రావాలని వెలగపూడి సచివాలయంలోని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత, దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తదితరులకు బుధవారం దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దుర్గగుడి ఈవో శీనానాయక్, ఆలయ ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, అర్చకస్వాములు ఆహ్వాన పత్రికలు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

దసరా ఏర్పాట్లపై మంత్రి ఆరా..

ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలను పురస్కరించుకుని దేవస్థానం అధికారులు చేపట్టిన ఏర్పాట్లపై దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సచివాలయంలోని తన ఛాంబర్‌లో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్, కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు, భద్రత, రవాణా ఏర్పాట్లను చేపట్టినట్టు అధికారులు మంత్రికి వివరించారు.



కృష్ణబాబుకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్టీసీ కార్మికపరిషత్ నేతలు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

» టిఆర్ అండ్ బి చీఫ్ సెక్రటరీకి కార్మిక నేతల వినతి

బస్‌స్టేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రవాణా, భవనాల శాఖ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన ఎం.టి.కృష్ణబాబును ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కోరారు. బుధవారం బందరు రోడ్డులోని ఎంటీ కృష్ణబాబును ఆయన కార్యాలయంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరావు, జి.వి.నరసయ్య, పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కృష్ణబాబును శాలువాతో సత్కరించారు. అనంతరం ఆర్టీసీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, కార్మికపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శేషగిరిరావు తదితరులు ఎం.టి.కృష్ణబాబును బందరురోడ్డులోని ఆయన కార్యాలయంలో కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. యూనియన్ నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, ఎస్.కె.మొయిద్దీన్, జి.వి.ఎస్.నారాయణతదితరులు పాల్గొన్నారు.



తాడిగడపలో ర్యాలీ నిర్వహిస్తున్న ఇండియా కూటమి శ్రేణులు

ఓట్లు కొల్లగొట్టి ప్రజాస్వామ్యం ఖూనీ

» కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు

పెనమలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఓట్లు దొంగిలించి దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. బుధవారం తాడిగడప సెంటరులో రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓట్ చోర్.. గద్దె చోడ్' కార్యక్రమానికి మద్దతుగా జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పూర్తిగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు అమ్ముడుపోయి దేశంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ కొంతమంది కార్పొరేట్లకు మాత్రమే పనిచేస్తున్నదని ఆరోపించారు. ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా నియోజకవర్గ ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని నిరసన కవాతును చేస్తున్నామని తెలిపారు. ధనేకుల మురళి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో సీనియర్ నేతలు వెలిసెల సుబ్రహ్మణ్యం, మునిసిపాలిటీ అధ్యక్షుడు కొసనం రాము, సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జెట్ వేగం

» ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పూర్తికి ఏపీఐఐసీ టెండర్లు
» రూ. 19.55 కోట్లతో ఆరు నెలల్లో పూర్తిచేయాలని గడువు
» వైసీపీ ప్రభుత్వ హయాంలో జెట్‌సిటీ విధ్వంసం
» కూటమి వచ్చాక అభివృద్ధికి తొలి అడుగు
» కాంప్లెక్స్ పూర్తయితే అన్ని వర్గాలకూ ఒకేచోట పని



జెట్‌సిటీలో అసంపూర్తిగా ఉన్న మొదటి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ టవర్

జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్) సిటీలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ బ్యాలెన్స్ పనులు పూర్తి చేయటానికి వీలుగా ఏపీఐఐసీ కీలక అడుగు వేసింది. వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా అరదశాబ్ద కాలంగా అసంపూర్తిగా ఉన్న ఈ కాంప్లెక్స్‌ను పూర్తి చేసేందుకు రూ.19.55 కోట్లతో టెండర్లు పిలిచింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో వాక్ టు వర్క్ విధానంలో జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్) సిటీ మెగా టౌన్‌షిప్‌కు శ్రీకారం చుట్టారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని ప్రకటించారు. ఆ వెంటనే ఇది ఏర్పాటైంది. జెట్‌సిటీని ఏపీ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఎంఎల్) శాఖ పరిధిలో చేపట్టేందుకు అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి ప్రజా రాజధాని అయితే జెట్‌సిటీని ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలని నాటి టీడీపీ ప్రభుత్వం భావించింది. దీంతో విజయవాడ శివారున జక్కంపూడి, వేమవరం, షాబాద గ్రామాల చుట్టూ వ్యాపించి ఉన్న కొండ ప్రాంతాన్ని ఎంపిక చేసింది. ఇక్కడ దాదాపు 300 ఎకరాల వరకు ఉంది. ఈ ప్రాంతంలో ముందుగా కొండల చుట్టూ పేద, మధ్య, ధనిక వర్గాలందరినీ దృష్టిలో ఉంచుకుని బహుళ అంతస్థుల భవనాలను నిర్మించాలని నిర్ణయించారు.

వైసీపీ హయాంలో చతికిలపడి..

పేద, మధ్య తరగతి వర్గాల కోసం 50 వేల ఇళ్ల నిర్మాణం తలపెట్టాలని నిర్ణయించి డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపారు. కేంద్రం ఆమోదం తర్వాత పీఎంఏవై కాంపోనెంట్ వాటా కూడా ఈ ఇళ్లకు తోడైంది. యుద్ధప్రాతిపదికన టిడ్కో ద్వారా కొండ ప్రాంతం చుట్టూ 15 వేల ఇళ్ల నిర్మాణాన్ని తలపెట్టేందుకు టెండర్లు పిలిచింది. ఎన్‌సీసీ అనే సంస్థ ఈ పనులు దక్కించుకుంది. ముందుగా 10 వేల ఇళ్లకు టెండర్లు పిలవగా, 7 వేలలోపు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 70 శాతం మేర పూర్తయ్యాయి. ఇదే సందర్భంలో ఇక్కడ నివసించే ప్రజలంతా స్థానికంగానే పనిచేసుకోవటానికి వీలుగా నాలుగు ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ టవర్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి నిర్మాణ బాధ్యతలను అప్పట్లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌కు అప్పగించింది. రూ.147 కోట్లతో మొదటి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు పనులు చేపట్టారు. దాదాపు టవర్ స్ట్రక్చర్ నిర్మాణం పూర్తయింది. గోడలు, ఇంటీరియర్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, పెయింటింగ్ వంటి పనులు మిగిలాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు.

కూటమి వచ్చాక పునరుజ్జీవం

కూటమి ప్రభుత్వం వచ్చాక.. జెట్‌సిటీలోని బ్యాలెన్స్ ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టడంతో పాటు అసంపూర్తిగా ఉన్న మొదటి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ టవర్ పనులను కూడా పూర్తి చేయించేందుకు వీలుగా ఏపీఐఐసీకి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఏపీఐఐసీ మొదటి టవర్ పనుల పూర్తికి టెండర్లు పిలిచింది. కేవలం ఆరు నెలల సమయం మాత్రమే ఇచ్చారు. ఈ ఆరు నెలల్లో మొదటి టవర్ పూర్తయితే వరుసగా రెండు, మూడు, నాలుగు టవర్లను ప్రణాళికగా పూర్తి చేయనున్నారు. ఈ టవర్లను కూడా వేర్వేరు పారిశ్రామిక సంస్థలకు కేటాయిస్తారు. దీంతో పేదలకు అందుబాటులోనే పనులు దొరుకుతాయి. ఈ ప్రాంతం కొత్తగా విస్తరిస్తుంది. జెట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా ఆ తర్వాత దశలో ధనిక వర్గాలకు గృహ నిర్మాణం, వారు వ్యాపారులు చేసుకోవటానికి వీలుగా కాంప్లెక్స్ టవర్లు, రోడ్ల నిర్మాణం, ఉద్యానవనాలు ఇలా అనేక ప్రణాళికలు ఉన్నాయి. మొదటి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పనులతో మళ్లీ జెట్‌సిటీకి కదలిక వచ్చింది.

స్త్రీ శక్తి @ రూ.23.69 కోట్లు

(5వ పేజీ తరువాయి)

రూ.23,69,32,651గా ఉంది. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులు గణాంకాలను విడుదల చేశారు. గత ఆగస్టు 15వ తేదీన స్త్రీ శక్తి పథకాన్ని సీం చంద్రబాబు ప్రారంభించారు. సెప్టెంబరు 15వ తేదీతో నెల రోజులు పూర్తి చేసుకుంది. ఎన్టీఆర్ జిల్లాలో 51,57,863 మంది మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఆటోనగర్, గవర్నర్‌పేట-1, గవర్నర్‌పేట-2, ఇబ్రహీంపట్నం, జగ్గయ్యపేట, తిరువూరు, విద్యాధరపురం, విజయవాడ బస్ డిపోల పరిధిలో విజయవాడ సబర్బన్, రూరల్ ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించారు. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోని మహిళలకు రూ.14.37 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం కల్పించింది. కృష్ణాజిల్లాలో 26,88,099 మంది మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. అవనిగడ్డ, గన్నవరం, గుడివాడ, మచిలీపట్నం, ఉయ్యూరు బస్‌డిపోల పరిధిలో మొత్తం 288 షెడ్యూల్స్‌లో మహిళలు రాకపోకలు సాగించారు. విజయవాడకు ఎక్కువ సంఖ్యలో వెళ్లి వచ్చారు. జిల్లాలో మహిళలకు ప్రభుత్వం తరఫున జీరో ఫేర్ టికెట్ల ప్రాతిపదికన రూ.9.31 కోట్ల సబ్సిడీని భరించటం జరిగింది.

ఆర్టీసీ స్థూల ఆదాయంలో ఒక వంతు రాయితీ

ఆర్టీసీ బస్సుల్లో ప్రధానంగా మహిళలకు సిటీ ఆర్డినరీ, మెట్రోఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్.. ఈ ఐదు బస్సులలో జీరో ఫేర్ టికెట్ రాయితీ కల్పిస్తున్నారు. ఈ బస్సులలో 60 శాతం అంతకు మించి మహిళా ప్రయాణికుల ఆక్యుపెన్సీ ఉంది. మిగిలిన డీలక్స్, సూపర్ లగ్జరీ, ఇంద్ర, నైట్‌రైడర్, గరుడ, అమరావతి, డాల్ఫిన్ బస్సులలో రాయితీ లేదు. స్థూలంగా అన్ని బస్సుల విషయానికి వస్తే ఒక వంతు మహిళా ప్రయాణికుల శాతం ఉంటోంది. హై ఎండ్ బస్సులలో పురుషుల ప్రయాణాల శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఓవరాల్‌గా చూస్తే మహిళలకు ఒక వంతు రాయితీ పోగా.. సగ భాగం డైరెక్టుగా ఆదాయం వస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో ఆర్టీసీకి రూ.38.68 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఆదాయంలో ఇప్పటి వరకు చూస్తే రూ.14.37 కోట్ల మేర మహిళలకు రాయితీగా ప్రభుత్వం ఇచ్చింది. స్థూలంగా చూస్తే.. రూ. 24.81 కోట్ల ఆదాయం ఆర్టీసీ అందిపుచ్చుకుంది. కృష్ణాజిల్లాలో మొత్తంగా రూ.15.03 కోట్ల మేర స్థూల ఆదాయం వచ్చింది. ఇందులో రూ.9.31 కోట్ల మేర మహిళలకు సబ్సిడీ కింద పోతే రూ. 6.72 కోట్ల మేర ఆర్టీసీకి మహిళాయేతర ప్రయాణికుల ఆదాయం వచ్చింది.

నెల రోజుల్లో పెనుమార్పులు

ఆర్టీసీలో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించిన నెల రోజుల్లో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. ప్రధానంగా విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ, కంకిపాడు, గన్నవరం, కొండపల్లి వంటి ప్రాంతాలలో ఉద్యోగాలు చేసుకోవటానికి రాకపోకలు సాగించే మహిళలంతా కూడా పూర్తిగా ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. విజయవాడలో చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు, షాపింగ్ వంటివాటికి వచ్చే మహిళలంతా ఆర్టీసీ బస్సులను ఉపయోగించుకుంటున్నారు. దీంతో సబర్బన్ పరిధిలో రూరల్ ప్రాంతాల నుంచి పైన చెప్పుకున్న నగర, పట్టణ ప్రాంతాలకు వచ్చే బస్సులలో నూటికి 80 శాతం మహిళలే ప్రయాణిస్తున్నారు. మహిళా ప్రభంజనంతో పురుషులు పాసులు రద్దు చేసుకుని ప్రత్యామ్నాయ రవాణా చూసుకుంటున్నారు.



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

పమిడిముక్కల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తాడింకి గ్రామ శివారు పండరీపురంలో బుధవారం విద్యుదాఘాతానికి గురై బాలుడు మృతి చెందాడు. పమిడిముక్కల పోలీసుల వివరాల ప్రకారం.. యడ్లపల్లి నాగరాజు కుమారుడు యడ్లపల్లి తిరుపతయ్య(4) ఆడుకుంటూ రైస్‌మిల్లు సమీపాన ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లగా అక్కడ ఉన్న ఫ్యూజువైర్లు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆడుకోవడానికి వెళ్లిన కుమారుడు ట్రాన్స్ ఫార్మర్ దగ్గర విగతజీవుడై పడిఉండటం చూసిన తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఫ్యూజు బాక్స్‌కు సేఫ్ గార్డు లేకపోవడం వల్లే బిడ్డను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై బి.శ్రీను సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదుచేశారు.

రాష్ట్రంలో దళితులపై పెరిగిన దాడులు

» అక్టోబర్ 18న లక్ష మందితో బహిరంగ సభ » రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

గాంధీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై అధికార, ప్రతిపక్షాలు స్పందించడం లేదని పలు దళిత, ప్రజా సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక దళితులపై దాడులు అధికమయ్యాయని మండిపడ్డారు. ప్రభుత్వంలోని దళిత నాయకులు ఈ దాడులను ఖండించకపోవడం బాధాకరమన్నారు. కైకలూరు నియోజకవర్గంలోని దానగూడెం గ్రామంలో దళితులపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఉప్పులేటి దేవీప్రసాద్, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ విక్టర్ బాబు, జైభీంరావు పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రంలో దళితులపై దౌర్జన్యాలు పెరిగాయన్నారు. అక్టోబర్ 18న ఏలూరులో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది.

నిరుద్యోగ సమస్యపై అసెంబ్లీలో చర్చించాలి

» నిరుద్యోగి ఆవేదన సదస్సులో వక్తలు

గాంధీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పలువురు వక్తలు విమర్శించారు.. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యపై చర్చించాలని వారు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో "నిరుద్యోగి ఆవేదన సదస్సు" గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ, ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వశాఖల్లోని ఖాళీలపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పోరాటాలకు నిరుద్యోగి ఆవేదన సదస్సు నాంది పలకాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా, నగర కార్యదర్శులు దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జివలరాజు, బి.నాజర్ జీ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై చర్యల్లేవ్!

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగులు తమదైన శైలిలో డీపీవో కార్యాలయ అధికారులతో మాట్లాడుకుని విచారణ వేగవంతం కాకుండా తెరవెనుక కథ నడుపుతున్నారని సమాచారం. గతంలో పక్కదారి పట్టించిన నగదును సర్దుబాటు చేసేందుకు కొంత సమయం ఇవ్వాలని, అప్పటి వరకు విచారణలో జాప్యం జరిగేలా చూడాలని ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. ఈ ఒప్పందం వెనుక పెద్ద మొత్తంలో నగదు చేతులు మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుడ్లవల్లేరు పంచాయతీలో ఇంటి పన్నులు, ఇతరత్రా పన్నుల రూపంలో వసూలు చేసి, పంచాయతీ ఖాతాలో జమకాని నగదు కనీసంగా రూ.30 లక్షలు వరకు ఉంటుందని సమాచారం. అధికారులు ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించి అక్రమాలకు పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కామినేనిలో విజయవంతంగా మోకీలు శస్త్రచికిత్స



ఆపరేషన్ వివరాలు చెబుతున్న డాక్టర్ షణ్ముక్ తుమాటి

మొగల్రాజపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : అత్యంత క్లిష్టమైన మోకీలు మార్పిడి శస్త్రచికిత్స చేసి రోగి 24గంటల్లో నడిచేలా చేయగలిగామని కామినేని హాస్పటల్ ఆర్థోపెడిక్, ట్రామా అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ డాక్టర్ షణ్ముఖ్ తుమాటి చెప్పారు. మొగల్రాజపురంలోని ఓ హోటల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మెదడులో రక్తం గడ్డకట్టిన స్థితిలో ఉన్న కంకిపాడుకు చెందిన మహిళ(57)కు విజయవంతంగా ఆపరేషన్ చేసినట్టు తెలిపారు. ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ఆర్ఎస్ వర్ధన్ మాట్లాడుతూ, అన్ని విభాగాల వైద్యుల సహాయంతో ఆపరేషన్‌లు విజయవంతంగా చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో కామినేని క్లస్టర్ హెడ్ పి.సునీల్‌కుమార్, మార్కెటింగ్ హెడ్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో యాత్రీ సేవ

గన్నవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం యాత్రీ సేవ దివస్ (ప్రయాణికుల సేవ దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. విమానాల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు స్వాగతం పలికారు. త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి, డిప్యూటీ సీఎం కె.పవన్ కల్యాణ్, కేంద్ర కమ్యూనికేషన్ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లు మొక్కలు నాటి నీళ్లు పోశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ప్రయాణికులందరికీ స్వాగతం, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, రక్తదానం, క్యాబ్/ట్యాక్సీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. విమానాశ్రయం గురించి పాఠశాల పిల్లలకు వివరించారు. విమానయాన రంగంలో కెరీర్ అవకాశాల గురించి అవగాహన కల్పించారు. జానపద నృత్యం, ప్రముఖ వ్యక్తులు, దేశభక్తి, థీమ్‌పై పాఠశాల పిల్లలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విమానాశ్రయంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. పలువురు ప్రయాణికులు.. డిప్యూటీ సీఎం పవన్, కేంద్రమంత్రి పెమ్మసాని, మోదీ కటౌట్‌తో ఫొటో దిగారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొని మాట్లాడుతున్న లక్ష్మణ్‌రావు

జీవో 114 తక్షణం అమలు చేయాలి

» ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మె
» కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నేతలు

ధర్నాచౌక్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ కారణంగా చివరిదశలో నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్స్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను పునఃప్రారంభించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ గవర్నమెంట్ కాలేజీస్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవో 114ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ధర్నాచౌక్‌లో 36 గంటల మహా దీక్ష బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం విద్యావ్యవస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ నిలిచిపోయిందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ, 2023 అక్టోబర్‌లో జారీచేసిన జీవో ప్రకారం కాంట్రాక్ట్ లెక్చరర్లను నేటికీ రెగ్యులర్ చేయకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి 2014కు ముందు నుంచి పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు అందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. దీనికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షప్రధానకార్యదర్శులు వై.జాన్‌బాబు, జీఎల్.మాణిక్యం మాట్లాడుతూ జీవో 114 పై ప్రభుత్వం స్పందించాలని లేదంటే భవిష్యత్‌లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని, నిరవధిక సమ్మెకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

రైతు బజారుకు డస్ట్‌బిన్లు, ట్రాలీల అందజేత



గన్నవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతు బజారుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో 40 డస్ట్‌బిన్‌లు, రెండు ట్రాలీలను ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావుకు బుధవారం అందజేశారు. ఉంగుటూరుకు చెందిన డోలా సన్యాసి నాయుడుకు రూ.3వేలు ఆర్థికసాయం చేశారు. మానవత చైర్మన్ మడుపల్లి బాల కృష్ణమూర్తి, కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షులు వీసం ప్రసాదరావు, కార్యదర్శి కృష్ణమోహన్, కోశాధికారి పొట్లూరు రామకృష్ణారావు, గన్నె వెంకట్రావు, సుబ్బారావు, వడ్లమూడి వెంకటేశ్వరరావు, కలపాల శ్రీనివాస్, మాగంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

4.5 కేజీల గంజాయి స్వాధీనం



గుణదల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఒరిస్సా నుంచి చిత్తూరుకు గంజాయి తరలించి సొమ్ము చేసుకుంటున్న వ్యక్తిని ఈగల్‌టీమ్ రామవరప్పాడు రైల్వే స్టేషన్ వద్ద బుధవారం అరెస్టు చేశారు. చిత్తూరుకు చెందిన ఎం. ఆర్య కొంత కాలం నుంచి ఒరిస్సాలోని చట్వా గ్రామంలో గంజాయి కొనుగోలు చేసి చిత్తూరు జిల్లాలోని అల్లమడుగు గ్రామానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నట్లు జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌కు సమా చారం అందింది. ఎస్పీ ఆదేశాల మేరకు ఈగల్ టీమ్ సభ్యులు డాగ్‌స్క్వాడ్‌తో బిలాస్‌పూర్ నుంచి తిరుపతి వెళుతున్న ట్రైన్లో తనిఖీలు చేపట్టారు. ట్రైన్ రామ వరప్పాడు వచ్చే సరికి ఓ వ్యక్తి పరుగులు తీస్తుండటాన్ని గమనించిన పోలీస్ జాగిలం అతనిని పట్టుకుంది. బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో ఉన్న 4.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

ఉయ్యూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి సమయంలో తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న షేక్ జిలానీని బుధవారం అరెస్టు చేసినట్టు ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు తెలిపారు. జిలాని మరో ఇద్దరు వ్యక్తులు కలసి ఉయ్యూరు, చుట్టుపక్కల ప్రాంతాల్లో చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతూ ఇటీవల ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల రోడ్డులో ఒక ఇంటిలో ప్రవేశించి బీరువా పగులగొట్టి ఏమీ దొరకకపోవడంతో ఎల్సీడీ టీవీ తీసుకుపోయారు. సీసీ కెమెరాల సాయంతో దొంగలను గుర్తించి నిఘా పెట్టగా జిలాని పట్టుబడగా మరో ఇద్దరు తప్పించుకున్నారని వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



ఉయ్యూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరిసాగులో నీరు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ వై.మనోహ రరావు అన్నారు. ఎగినపాడులో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరిసాగులో పా టించవలసిన యాజమాన్య పద్ధతులు రైతులకు వివరించారు. ఎలుకల నివారణ సామూహికంగా చేపట్టాలని సూచించారు. కె. జ్యోతిరాణి, కె.శ్రీనివాసరావు, బి.పద్మజ, ఎంఏవో బి.నిస్సీగ్రేస్ తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు.

మొరాయించిన వాహనం- నిలిచిన ట్రాఫిక్



గుణదల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిమెంట్‌లోడుతో వెళుతున్న వాహనం రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో వెనుక చక్రం విరిగిపోయింది. దీంతో వాహనం రింగ్‌లోనే అడ్డుగా ఉండిపోవడంతో బుధవారం ఉదయం వాహనాల రాకపోకలకు కొద్దిసేపు ఇబ్బంది కలిగింది. దీంతో బెంజిసర్కిల్ వైపు నుంచి వచ్చే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ సీఐ రమేష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను క్రమబద్ధీకరించారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



శివాలయం కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న రాజశేఖర్ దంపతులు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బాపుల పాడు శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవాలయ ప్రాంగణంలో నూతనంగా చేపట్టిన హరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం బాపులపాడు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొనకళ్ల రాజశేఖర్, ధనలక్ష్మి దంపతులు రూ.70,516లు విరాళం అందించారు. రాజశేఖర్ దంపతులను ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా, సభ్యులు గూడపాటి రత్నశేఖర్, కొల్లి వెంకట్రావు, తమిరి రమేష్ అభినందనలు తెలిపారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : కాకులపాడులో గంగాన మ్మతల్లికి బుధవారం అంగరంగ వైభవంగా అభిషేకమహోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగానమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ జరిగిన 45రోజులు పూర్తయిన సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో, పండ్ల రసాలతో, శంఖాలతో అభిషేకం నిర్వహించారు. కామినేని శ్రీహరిరావు దంపతులు, రామినేని మన్మోహన్ దంపతులు, వీరపనేని రాజేశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు!

- గుంతలమయంగా జబర్లపూడి-ముదునూరు రోడ్డు
- మద్దూరు పరిధిలో దెబ్బతిన్న విజయవాడ- అవనిగడ్డ కరకట్ట రోడ్డు
- ప్రయాణించాలంటే భయపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



జబర్లపూడి - ముదునూరు రోడ్డుపై భారీ గుంత.. మద్దూరు వద్ద ప్రమాదకరంగా విజయవాడ - అవనిగడ్డ కరకట్ట రోడ్డు

(ఉయ్యూరు/కంకిపాడు - ఆంధ్రజ్యోతి)

జబర్లపూడి-ముదునూరు జిల్లాపరిషత్ రోడ్డు గుంతలమయంగా తయారై వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండటంతో గ్రామస్తులకు అసౌకర్యం కలుగుతుంది. జబర్లపూడి నుంచి ముదునూరు వెళ్లేందుకు ఇదే రోడ్డు కావడంతో పొడవునా పెద్ద గుంతలు ఏర్పడి వర్షాలకు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఈమార్గంలో ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. పొలాల మధ్య బాహ్యప్ర పంచానికి దూరంగా ఉండే జబర్లపూడి నుంచి బయటకు రావాలంటే ముదునూరు లేదా, మద్రివాడ రోడ్డు ఉపయోగించవలసి ఉంది. ఈ నేపథ్యంలో రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

మద్దూరు వద్ద ప్రమాదకరంగా విజయవాడ - అవనిగడ్డ కరకట్ట రోడ్డు

విజయవాడ- అవనిగడ్డ కరకట్ట ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. మద్దూరు పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై ప్రభుత్వం ఆర్టీసీ బస్సులకు కూడా అనుమతి ఇవ్వడంతో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. మరో పక్క ఇసుక టిప్పర్లు సంఖ్య అత్యధికంగా పెరిగింది. నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లు రయి రయి మంటున్నాయి. మరో పక్క మోటార్ సైకిళ్లు, కార్లు సంఖ్య పెరగడంతో ప్రయాణికులు ఈ ప్రధాన రహదారిపై ప్రయాణించాలంటే భయపడుతున్నారు. ఇటీవల ఈ ప్రధాన రహదారిపై ప్రమాదాల సంఖ్య కూడా పెరిగింది. రహదారి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.



గండిగుంటలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్.. ప్రసాదంపాడులో మాట్లాడుతున్న సర్పంచ్ గంగారత్నం.. బాపులపాడు పీహెచ్‌సీలో.. స్వస్థ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం

స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



యనమలకుదురులో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలో మహిళలు, చిన్న పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉన్నట్లవుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం యనమలకుదురు అర్బన్ హెల్త్ సెంటరులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. భారత ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా మహిళలు, పిల్లల ఆరోగ్యానికి సాధికారత కల్పించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా బుధవారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వైద్యులు డాక్టర్ వజ్రకుమార్, డాక్టర్ హారిక, సీహెచ్ఓ కుమార్, వైద్యసిబ్బంది, వెలగపూడి ట్రస్టు తరపున దొడ్డపనేని నాగలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

రూ.7.62 లక్షల విలువైన ఎల్వోసీల పంపిణీ

నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 9మందికి 7.62లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్వోసీ పత్రాలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, కొమ్మినేని శ్రీనివాస్, కంకిపాడు శ్రీనివాస్, రమేష్ సుంకర తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : మహిళల ఆరోగ్యం మెరుగుపరచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపటిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకం సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్ అన్నారు. గండిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మహిళలు, కిశోర బాలికలకు వైద్యపరీక్షల శిబిరం ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శివశంకర్, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, పీహెచ్‌సీ అధికారి ఎస్.తేజస్విని, గ్రామపంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి కృపాకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుణదల: ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని ప్రసాదంపాడు సర్పంచ్ సర్నాల గంగారత్నం అన్నారు. నేటి నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు తలపెట్టిన స్వస్త్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రసాదంపాడులో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజేంద్రప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్వేత, రామవరప్పాడు, ప్రసాదంపాడు ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్: మహిళలు ఆరోగ్యంగా ఉన్నపుడే ఆ కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడతుందని బాపు లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కింద పీహెచ్‌సీ పరిధిలోని బాపులపాడు తారకరామ నగర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో వైద్యాధికారి శ్రీనివాస్ వైద్యపరీక్షలు నిర్వహించారు. 102 మంది మహిళలు, బాలబాలికలకు వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన వైద్య సేవలను అందజేశారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబ సాధికారత సాధ్యమని తద్వారా సామాజికాభివృద్ధికి తోడ్పాటునందిస్తుందని సర్పంచ్ వడ్లమూడి అమ్మాజీ అన్నారు. బండారుగూడెంలో బుధవారం వీరవల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం, అవగాహన నిర్వహించారు. హిమోగ్లోబిన్, రక్తహీనత వంటి సమస్యలను గుర్తించడం గురించి డాక్టర్ ప్రణయ్‌సాగర్ మహిళలకు సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శరత్‌చంద్ర, ఏడుకొండలు, ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి, ఏఎన్ఎం పద్మావతి, తదితరులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

ఉంగుటూరు : అధిక పోషకవిలువలు కలిగిన బలవర్ధకమైన ఆహారమే ఆరోగ్యాన్ని పరిరక్షించే ఔషధమని, దానిని క్రమపద్ధతిలో తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలుగుతామని ఇందుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బి.శిరీష అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని తరిగొప్పలలో

ప్రభుత్వ కృషితోనే 3వ జోన్‌కు సాగర్ జలాలు

ఎన్ఎస్ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ



హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ విశేష కృషి వల్లే 3వ జోన్‌కు ముందుగానే సాగర్ జలాలు విడుదలయ్యాయని, ముందుగా చెరువులు నింపుకోవాలని ఎన్ఎస్ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. మల్లవల్లి వద్ద గల బాపులపాడు మేజర్ రెగ్యులేటర్ వద్దకు చేరుకున్న సాగర్ జలాలకు బుధవారం అధికారులు, రైతులు, టీడీపీ నాయకులతో కలిసి పూలు జల్లుతూ స్వాగతం పలికారు.

విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు పంపిణీ



ప్రసాదంపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గన్నవరం నియోజకవర్గంలోని ప్రత్యేక అవసరాలున్న వారికి రూ.12.60 లక్షల విలువైన బ్యాటరీతో నడిచే 23 ట్రై సైకిళ్లను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అందజేశారు. బుధవారం ఎనికేపాడు టీడీపీ కార్యాలయంలో 23 మందికి బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ గన్నవరం, బాపులపాడు, విజయవాడ రూరల్ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



గన్నవరంలో ర్యాలీ చేస్తున్న ఆటో కార్మికులు

గన్నవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తి పథకం వలన ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని వారిని ఆదుకోవాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పోలినాయుడు అన్నారు. స్థానిక బస్టాండ్ నుంచి ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నిరసన ప్రదర్శన చేసి డిప్యూటీ తహశీల్దార్ భవానికి వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు, బెజవాడ తాతబ్బాయి, మల్లంపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శి ఎం.పూర్ణచంద్రరావు, జి.రామకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు దశల వారి నిరసన, ధర్నా కార్యక్రమంలో భాగంగా బుధవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కేవీ శివయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలన్నారు. అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్‌లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. నామినీ వీఆర్ఏలను క్రమబద్ధీకరించాలన్నారు. నాయకులు జి.వెంకటరత్నం, జోస్పిన్, డి.అనూష, ఝాన్సీ, సుజాత, గీత, సువర్ణ, పద్మారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

దుర్గగుడిలో అన్నప్రసాద వితరణకు విరాళం



ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దుర్గమ్మవారి సన్నిధిలో నిత్యం జరిగే అన్నప్రసాద వితరణకు విజయవాడ కానూరుకు చెందిన కోనేరు అనుపమ, వెంకట యశస్విని రూ.1,00,116లు విరాళం అందచేశారు. బుధవారం ఇంద్రకీలాద్రికి విచ్చేసిన దాత అధికారుల ద్వారా విరాళం సమర్పించారు. దుర్గగుడి అధికారులు దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు అందచేశారు. అధికారులు వారికి లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

విద్యార్థులు వినూత్న ప్రాజెక్టులు రూపొందించాలి



ఉంగుటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వినూత్న ప్రాజెక్టులను రూపొందించడంద్వారా సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రదర్శించేందుకు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గొప్ప వేదిక అని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. స్థానిక కళాశాలలో ఏఐ, సీఎస్ఈ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్, ఐడియాథాన్ ప్రాజెక్టుల నమూనా పోటీలు ఘనంగా నిర్వహించారు. ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజేతలైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం చేతులమీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఏఐ, సీఎస్ఈ విభాగాధిపతులు కేపీఎస్‌వీ సత్యశ్రీ, రాయ్‌చౌదరి పాల్గొన్నారు.



ఘనంగా మోదీ జన్మదినం

పెనమలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదిన వేడుకలను బుధవారం పోరంకి వల్లూరు ఫౌండేషన్‌లో ఘనంగా నిర్వహించారు. మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ విద్యార్థులు చేపట్టిన ప్లకార్డులు అందరినీ ఆకర్షించాయి. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గోపిశెట్టి దుర్గాప్రసాద్, కన్వీనర్ యేకుల విజయేంద్ర, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రోహిణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **హనుమాన్‌జంక్షన్‌రూరల్:** పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తున్న ప్రధాని మోదీ జన్మదినోత్సవ సందర్భంగా మొక్కలు నాటినట్లు ఏపీఆర్డీసీ డైరెక్టర్ గరికపాటి శివశంకర్ తెలిపారు. కానుమోలుకు చెందిన రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కానుమోలు, బాపుల పాడుల్లో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. రాణా వెల్ఫేర్ సొసైటీ ప్రముఖుల పుట్టినరోజున మొక్కలు నాటడం అభినందనీయమన్నారు.

మహారాజశ్రీ II అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి వ.గో.జిల్లా, ఏలూరు

ఓ.ఎస్.నెం. 22/2024

జట్టీన్
గుబ్బల లక్ష్మీ & 2 అదర్స్ ...వాది
మరియు
పర్రి కరుణ & 6 అదర్స్ ...ప్రతివాది

వాది తరఫు దాఖలు చేసిన పబ్లికేషన్
పై నెంబరు గల దావాలో ప్రతివాదులు అయిన తిరుమల శెట్టి పూర్ణ చంద్ర కుమార్ తండ్రి: లీల మాధవ రాము, డోర్.నెం. 30-10 గాయత్రి నగర్, నియర్ బ్రహ్మంగారి గుడి,వెంకటాపురం పంచాయతీ, ఏలూరు ముప్పనంగి రాజ్యలక్ష్మి భర్త: రమేష్ బాబు, డోర్.నెం. 1-231 చర్చ్‌రోడ్, పోరంకి,విజయవాడ అనువారు పై కోర్టులో 25.09.2025 తేది ఉదయం గం.10.30ని. లకి వాయిదా అయి ఉన్నది. కావున స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గానిహాజరయి తమ అక్షేపణలు తెలియపరచుకొనవచ్చును. లేని యెడల సదరు దావా తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కె.వి.ఆర్.కె. సుబ్బారావు
కె.మోక్ష
అడ్వకేట్స్,ఏలూరు

ఏలూరు
ది.16.09.2025

ఉపనదుల నీటిని ఒడిసిపట్టాలి?

జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలకు ఉపనదులే వరం ● వైరా, మునేరు, కట్టలేరు, పాలేరు ఉప నదుల ద్వారా వృథాగా పోతున్న నీళ్లు
● ఈ నీళ్లన్నీ కృష్ణానదిలోకి వెళ్లి బ్యారేజీ మీదుగా సముద్రంపాలు ● ఒడిసిపట్టే చర్యలు చేపడితే పశ్చిమ ఎన్టీఆర్ బంగారమే..!

ఆంధ్రజ్యోతి, కంచికచర్ల: ఎన్టీఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో మునేరు, వైరాయేరు, కట్లేరు, పాలేరుతో పాటుగా ప్రధానమైన వాగులున్నాయి. ప్రతి ఏడాదీ కొన్ని టీఎంసీల నీళ్లు వృథాగా పోతున్నాయి. తాగు, సాగునీటికి ఈ రెండు నియోజకవర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ ఈ నీటిని వినియోగించుకునేందుకు పాలకులు, అధికారులు శ్రద్ధ చూపటం లేదు. వృథాగా పోతున్న ఎంతో విలువైన నీటిని ఒడిసిపట్టే దిశగా చర్యలు తీసుకోవటం లేదు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా పాకాల చెరువు నుంచి మునేరు ప్రారంభమవుతోంది. వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కొద్దిపాటి వర్షం కురిసినా మునేటికి నీళ్లు వస్తాయి. వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల మీదుగా మునేరు ప్రవహిస్తోంది. ఖమ్మం జిల్లా వైరా రిజర్వాయర్ నుంచి ప్రారంభమయ్యే వైరాయేరులో, తిరువూరు ప్రాంతం నుంచి వచ్చే కట్టలేరు, నందిగామ మండలం దాములూరు కూడలి, వీరులపాడు మండలం పల్లెంపల్లి గ్రామాల వద్ద విలీనమవుతుంది. అక్కడి నుంచి నందిగామ, వీరులపాడు మండలాల మధ్యగా ప్రవహించే వైరాయేరు కీసర వంతెన ఎగువ భాగంలో మునేటిలో కలిసిపోతుంది. ఈ మునేరు కంచికచర్ల మండలం మున్నలూరు, చందర్లపాడు మండలం ఏటూరు గ్రామాల మధ్య కృష్ణానదిలో కలుస్తోంది.


వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద బ్రిటీష్ హయాంలో నిర్మించిన చెక్‌డ్యామ్

బ్రిటీష్ హయాంలోనే చెక్‌డ్యామ్.. వేలాది ఎకరాలకు సాగునీరు

బ్రిటీష్ హయాంలో 1898లో వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద మునేటిపై చెక్‌డ్యామ్ నిర్మించారు. దీనివల్ల నందిగామ, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలకు చెందిన 30 వేల ఎకరాలకు సాగునీరందుతోంది. చెక్‌డ్యామ్ వద్ద పూడిక వేయటంతో మునేటిలో నీటి నిల్వ పరిమాణం తగ్గటం వల్ల ఆయకట్టుకు సజావుగా సాగునీరు అందటం లేదు. ఇక్కడే గేట్లు ఏర్పాటు చేసి రోడ్డు కమ్ బ్యారేజ్ కట్టేందుకు 2004లో మన పాలకులు శ్రీకారం చుట్టారు. పుష్కరం గడిచినప్పటికీ ఆనకట్ట పూర్తి కాలేదంటే పాలకులకున్న శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

కీసర వద్ద నీటి నిల్వకు పరిశీలించాలి

కీసర వద్ద మునేటి నీరు నిల్వకు గల అవకాశాలను అధికారులు పరిశీలన చేయాలని రైతులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. కీసర వద్ద మునేటిపై బ్రిటీష్ హయాంలో ఇనుప గడ్డర్లతో నిర్మించిన వంతెన పైభాగం కొద్దిగా 4 దశాబ్దాల క్రితం కూలిపోయింది. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నప్పటికీ వంతెన స్ట్రక్చరు బలంగానే ఉందంటున్నారు. నీటినిల్వకు అవసరమైతే ఈ స్ట్రక్చరును ఉపయోగించుకోవచ్చునని రైతు నేతలు చెపుతున్నారు.

చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి

మునేటిపై కీసర, పెనుగంచిప్రోలు, లింగాలతో పాటుగా పలుచోట్ల చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. గతంలో మండు వేసవి రోహిణి కార్తెలో సైతం మునేటిలో నీళ్లుండేవి. మారుతున్న వాతావరణం, అడ్డగోలు ఇసుక తవ్వకాలు ఇత్యాది కారణాలతో కొన్నేళ్ల నుంచి మునేరు డిసెంబర్‌లోనే ఎండిపోతోంది. నందిగామ, కంచికచర్ల పట్టణాలతో పాటు పలు గ్రామాలకు కీసర నుంచే తాగునీరు సరఫరా అవుతోంది. భూగర్భ జలాలు అడుగంటుతున్నందున సమీప భవిష్యత్తులోనూ నీరు దొరకని దుస్థితి ఏర్పడి తాగు, సాగునీరుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి చెక్‌డ్యామ్‌లు నిర్మించాలన్న ప్రతిపాదనలకు కార్యరూపం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.


కీసర వద్ద బ్రిటీష్ హయాంలో ఇనుప గడ్డర్లతో నిర్మించిన వంతెన


ద్వారకా తిరుమలరావుకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఈవో శ్రీరామ వరప్రసాదరావు

సుబ్రహ్మణ్యేశ్వరుడి సన్నిధిలో ఆర్టీసీ ఎండీ

మోపిదేవి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలు ఆయనకు అందించారు.

75వ సారి రక్తదానం

● పలువురికి ఆదర్శంగా నిలిచిన కస్తూరి విజయ్‌కుమార్



చల్లపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన పెంచటంతో పాటు ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు చల్లపల్లికి చెందిన స్వచ్ఛ కార్యకర్త కస్తూరి విజయ్‌కుమార్. బుధవారం 75వ సారి రక్తదానం చేసి నియోజకవర్గంలో అత్యధికసార్లు రక్తదానం చేసిన వ్యక్తిగా నిలిచారు. పుట్టిన రోజున క్రమం తప్పకుండా రక్తదానం చేయటాన్ని అలవాటు చేసుకోవటంతోపాటు అత్యవసర సమయాల్లోనూ రక్తదానం చేస్తున్నారు. కుటుంబ సభ్యులనూ రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నారు. మన అవనిగడ్డ బ్లడ్ డోనర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరికో రక్తం అందేలా యువతను సమీకరిస్తూ రక్తదానం చేయించటం విజయ్‌కుమార్ నిత్యకృత్యం. పుట్టినరోజున రక్తదానం చేసిన విజయ్‌కుమార్‌ను మన అవనిగడ్డ బ్లడ్ డోనర్స్ గ్రూపు నిర్వాహకులు ఇమ్మడిశెట్టి వెంకట్, ఆలపాటి పవన్‌కుమార్ అభినందించారు.

పేర్ని నాని కల్లబొల్లి కబుర్లు వినేవారు లేరు

● టీడీపీ నేత దిలీప్‌కుమార్



మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అసత్య ఆరోపణలు, కల్లబొల్లి మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ నేత దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగనాయక స్వామికి చెందిన ఐదెకరాల 30 సెంట్లు పేర్ని నాని అక్రమంగా ప్రణాళికాబద్ధంగా దోచుకుని ఏమీ తెలియదనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆలయ భూముల్లో హైపర్ టెన్షన్ విద్యుత్ లైన్లను తొలగించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. తప్పు ఒప్పుకుని ఆయా భూములను తిరిగి దేవస్థానానికి తిరిగిచ్చేయాలని దిలీప్ డిమాండ్ చేశారు. టీడీపీ నేత గొర్రెపాటి గోపీచంద్ కానీ, ఆయన సతీమణి గొర్రెపాటి రాజేశ్వరి కానీ పాటల్లో పాల్గొన్నారన్నది అబూత కల్పనని అన్నారు. వేలంలోని రిజిష్టర్లను దిలీప్ చూపిస్తూ మాట్లాడారు. ఎలాంటి అధికారం లేకపోయినా పేర్ని కిట్టు రాజ్యాంగేతర శక్తిగా ఐదేళ్లపాటు ప్రవర్తించాడన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని మాట్లాడుతూ టీడీపీలోని పదవులపై పేర్ని నాని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉండగా కోనేరుసెంటర్‌లో జగన్ వెంట ఉంటానని పేర్ని నాని చెప్పారని, సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి విప్ పదవి ఇవ్వడంతో అదే పదవిలో కొనసాగారన్నారు. జనసేన నేత మాదివాడ రాము మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి తాను సేవ చేశానని, పేర్ని నాని వ్యవహారశైలికి విసుగెత్తి జనసేనలో చేరానన్నారు. టీడీపీ నేతలు పీవీ ఫణికుమార్, బురకా బాలాజీ మాట్లాడారు.


తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పరిపూర్ణానందగిరి స్వామీజీ, పాల్గొన్న గ్రామ ప్రముఖులు

శృతి భారతి వేదపాఠశాల ప్రారంభం

● పూజలు నిర్వహించిన ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి

ఘంటసాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాడేపల్లి గ్రామంలోని శ్రీ మలయాళ స్వాముల వారి పెద్దాశ్రమంలో ఏర్పాటు చేసిన శృతి భారతి వేదపాఠశాలను ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానంద గిరి స్వామిజీ బుధవారం ప్రారంభించారు. కంప్యూటర్ గదిని అసంఘానంద గిరి స్వామిజీ ప్రారంభించగా, ఎన్ఆర్ఐ మూల్పూరి వెంకట్రావు - సావిత్రి దంపతుల ఆర్థిక సహకారం రూ.16 లక్షలతో నిర్మించే 8 వసతి తరగతి గదుల నిర్మాణాలకు స్వామిజీలు శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పరిపూర్ణానంద గిరిస్వామిజీ మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంతో ఏకత్వం కలిగి ఉందని, ఆచార, సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతమైన తాడేపల్లిలో శృతి భారతి వేద పాఠశాలలో అక్టోబరు 1 నుంచి రెండేళ్ల సంస్కృత తరగతి కోర్సు ప్రారంభమవుతాయన్నారు. విశ్రాంత సంస్కృత అధ్యాపకుడు రంగాచార్యులు, గణేష్, టీడీపీ నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గొర్రెపాటి సురేష్, యార్లగడ్డ వీరభద్రరావు, సూరపనేని వెంకట్రావు, ఆశ్రమ నిర్వాహకులు కోదండ రామయ్య, మొవ్వ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఎన్ఆర్ఐ సూరపనేని శ్రీనివాస్ - నాగప్రియ దంపతుల ఆర్థిక సహకారంతో చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల వారిచే తాడేపల్లి పెద్దాశ్రమంలో గురువారం నిర్వహించనున్న ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానంద గిరి స్వామిజీ తెలిపారు. 18 నుంచి 24 వరకు కంటి పరీక్షలు, 22 నుంచి 26 వరకు అవసరమైన వారికి ఆపరేషన్లు ఆశ్రమ ప్రాంగణంలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు.

గొల్లపూడిలోని ఆలయ భూముల్లో

ఎగ్జిబిషన్‌కు హైకోర్టు అనుమతి

● సింగిల్ జడ్జి ఉత్తర్వులపై ధర్మాసనం స్టే

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ, గొల్లపూడి గ్రామం పరిధిలోని ఆలయ భూముల్లో విజయవాడ ఉత్సవ్ పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహణకు హైకోర్టు ధర్మాసనం అనుమతిచ్చింది. గొడుగుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం భూములను వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది. కేవలం 56 రోజుల పాటు మాత్రమే ఆ భూముల్లో ఎగ్జిబిషన్ నిర్వహణకు లైసెన్స్ ఇచ్చారని గుర్తుచేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

విశ్వకర్మ అందరికీ ఆరాధ్య దైవం

● మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అన్ని రంగాల్లో నిర్మాణానికి పంచవృత్తులను కల్పించిన విశ్వకర్మ అందరికీ ఆరాధ్యదైవమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా బుధవారం మచిలీపట్నంలోని విశ్వబ్రాహ్మణ కాలనీలోని విరాట్ విశ్వకర్మ దేవాలయంలో జరిగిన ప్రత్యేక అర్చనల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వకర్మ అనంత విశ్వానికి సృష్టికర్త అని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకుని చేతివృత్తుల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నారు. బహుళజాతి సంస్థలకు దీటుగా తమ నైపుణ్యాలతో వస్తువులను మార్కెటింగ్ చేసుకోవాలన్నారు. మంత్రితోపాటు మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, టీడీపీ నేతలు ముంతా రవీంద్ర కుమార్, పీవీ రమణ, జే దుర్గా ప్రసాద్, కే శ్రీను సీహెచ్ ప్రసాద్, ఎం శ్రీధర్, పీవీ మురళీధర్ పాల్గొన్నారు. కాగా చిలకలపూడిలోని విశ్వకర్మ దేవాలయంలో ప్రత్యేక అర్చనలు చేశారు.


మందిరంలో జరిగిన అర్చనల్లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక అర్చనల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జీ రామ బహ్మం ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక అర్చనలు జరిపారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న విశ్వకర్మ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

మచిలీపట్నం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పోలీసు అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వీవీ నాయుడు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో హల్దియా పారిశ్రామిక ప్రాంతం విశ్వకర్మ పూజకు ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ బీ సత్యన్నారాయణ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

● ఎన్‌పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ అదితి అగర్వాల్

గన్నవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని నేషనల్ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ డైరెక్టర్ అదితి అగర్వాల్ అన్నారు. మండలంలోని కేసరపల్లి గ్రామాన్ని నేషనల్ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ డైరెక్టర్ అదితి అగర్వాల్ నేతృత్వంలోని కేంద్ర బృందం బుధవారం పర్యటించింది. తొలుత రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్వర్ణ పంచాయతీ పోర్టల్‌పై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల్లో స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో పన్నుల వసూళ్ల చేయడం గురించి రాష్ట్ర పంచాయతీరాజ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. పన్నులు వసూళ్ల ద్వారా వచ్చిన నిధులను ఎలా అభివృద్ధి పనులకు, మౌలిక సదుపాయల కల్పనకు వినియోగిస్తున్న విధానాన్ని వివరించారు. 2021లో తమ పాలకవర్గం అధికారంలోకి వచ్చాక రూ.45లక్షలున్న గ్రామ పంచాయతీ వార్షిక ఆదాయాన్ని ప్రస్తుతం రూ.2 కోట్లుకు పెంచినట్టు సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. పెరిగిన ఆదాయంతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అనంతరం ఈ బృందం హెచ్‌సీఎల్ వద్ద గ్రామ పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన కుంభకోణం కాఫీ స్టాల్‌ను పరిశీలించారు. ఈ స్టాల్ ద్వారా నెలకు రూ.70 వేల వరకు గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తున్నట్లు ఇన్చార్జ్ ఈవోపీఆర్డీ రాజబాబు కేంద్ర బృందం దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గ్రామపంచాయతీల ఆదాయం పెంచుకునేందుకు కాఫీ స్టాల్, క్రికెట్ నెట్లు వంటివి ఏర్పాటు చేయడం అభినందనీయమని అదితి అగర్వాల్ పేర్కొన్నారు. ఉపసర్పంచ్ జాస్తి శ్రీధర్ బాబు, ఎంపీటీసీ సభ్యులు శాంతి కిషోర్, పంచాయతీరాజ్ అసిస్టెంట్ డైరెక్టర్లు చందన, హర్ష, చైతన్య పాల్గొన్నారు.


కుంభకోణం కాఫీ స్టాల్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గొల్లమంద - జింకపాలెం రోడ్డు శంకుస్థాపనకు

ఏటిమొగలో కలెక్టర్, ఎమ్మెల్యే స్థల పరిశీలన

నాగాయలంక, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదురుమొండి పంచాయతీలోని గొల్లమంద వయా బ్రహ్మయ్యగారి మూల రహదారి నిర్మాణానికి అతి త్వరలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌చే శంకుస్థాపన సభను నిర్వహించేందుకు బుధవారం కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఏటిమొగ గ్రామంలోని మార్కెట్ యార్డు ప్రదేశం, జడ్పీ పాఠశాల ప్రాంగణంలో స్థానిక తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ సంబంధిత అధికారులతో కలిసి స్థలపరిశీలన చేశారు. ఆసియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నిధులు రూ.1.3 కోట్ల 88 లక్షలతో ఎదురుమొండి పంచాయతీలోని గొల్లమంద - జింకపాలెం పునర్నిర్మించనున్నారు. టెండర్లు ఖరారయ్యాయి. కృష్ణానదికి తరచుగా వచ్చే వరదలకు బ్రహ్మయ్యగారి మూలరోడ్డు కోతకు గురికావటం, ప్రజలకు రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తక్షణమే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి ప్రత్యేక శ్రద్ధతో నిధులు మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్‌చే రహదారి పనులు ప్రారంభించేందుకు, సభావేదిక ఏర్పాటుకు రెండుచోట్ల స్థల పరిశీలన చేశారు. ఆర్డీవో కే స్వాతి, పంచాయతీరాజ్ శాఖ డీఈఈ పీ సురేష్‌బాబు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం భావదేవరపల్లి గ్రామంలోని ఆక్వా సాగును కలెక్టర్ పరిశీలించారు.



బాలికపై లైంగిక వేధింపులు

● పురుగుమందు సేవించిన బాలిక
● పోక్సో యాక్టుపై యువకుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

మైలవరం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువకుడి లైంగిక వేధింపులను తట్టుకోలేక పురుగుమందు తాగిన బాలిక ప్రాణాపాయ స్థితిలో ఉన్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైలవరం ఎస్సై కే సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోరాట నగర్‌కు చెందిన 17 ఏళ్ల బాలిక పాఠశాలలో 10వ తరగతి వరకు చదివి, 2 నెలల క్రితం తండ్రి చనిపోవడంతో తల్లితోపాటు ఇంటి వద్దనే ఉంటుంది. అదే గ్రామానికి చెందిన అజ్మీర రమేష్ నాయక్ అనే యువకుడు బాలికకు మాయ మాటలు చెప్పి లోబర్చుకున్నాడు. నెల రోజులుగా అనేకమార్లు లైంగిక వేధింపులకు పాల్పడటం ఇంట్లో తెలియడంతో ఈనెల 9న బాలిక ఎలుకల మందు సేవించింది. దీంతో బాలికను విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ఐసీయూలో చికిత్సపొందుతున్నట్లు తెలిపారు. ఈనెల 15న బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో యాక్ట్‌పై కేసు నమోదు చేసి రమేష్ నాయక్‌ను అరెస్ట్ చేయడంతోపాటు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

డంపింగ్ యార్డు రహిత రాష్ట్ర సాధనే లక్ష్యం

● మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ



స్వచ్ఛతాహి సేవలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, మంత్రి నారాయణ, కమిషనర్ ధ్యానచంద్ర, తదితరులు

భారతీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని డంపింగ్ యార్డు రహితంగా మార్చేందుకు నూతన విధానాలను అనుసరిస్తున్నామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్‌లో ప్రజలు పాల్గొని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని మంత్రి పీ నారాయణ అన్నారు. తూర్పు నియోజక వర్గంలోని 10వ డివిజన్‌లోని కేపీ నగర్‌లో వీఎంసీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ బుధవారం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, మంత్రి పీ నారాయణ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్ రెడ్డి, చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేష్ కుమార్, మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్, కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అధికారులతో పాటు ప్రజలందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి గాంధీ జయంతి అక్టోబరు 2 వరకు 16 రోజుల పాటు స్వచ్ఛతా హీ సేవ నిర్వహించబడుతుందన్నారు. స్వచ్ఛ ఉత్సవం ఇతివృత్తంతో క్లీన్, గ్రీన్, వేస్ట్ మేనేజ్‌మెంట్ లక్ష్యాలుగా వినూత్న కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ప్లాస్టిక్ రహిత జీవనశైలిని ప్రోత్సహించడంలో భాగంగా తొలి అడుగుగా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయ బాటిళ్లు ఉపయోగిస్తున్నామని మంత్రి తెలిపారు. అక్టోబరు 2 నుంచి అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలు, శాఖల కార్యాలయాల్లోనూ ఇలాంటి చర్యలు తీసుకొని దశలవారీగా ప్రజలను భాగస్వాములుగా చేసేందుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం పాల్గొని ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. నిర్లక్ష్యానికి గురైన అమృత్ పథకం ద్వారా త్వరలోనే పనులకు టెండర్లు పిలుస్తామన్నారు. గత ప్రభుత్వం ప్రజలపై చెత్త పన్నువేసి రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిందన్నారు. ఇప్పటికే 83 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, మిగిలిన చెత్తను త్వరలోనే తొలగిస్తామన్నారు. డివిజన్ కార్పొరేటర్ దేవినేని అపర్ణ, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, వీఎంసీ అధికారులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి రోబో ఎక్స్-2025

- సిద్ధార్థ వర్సిటీలో జాతీయ పోటీలకు సర్వం సిద్ధం.. ఏర్పాట్లు పూర్తి
- వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 400 మంది విద్యార్థుల రాక
- ఇన్నోవేట్, ఆటోమేట్, డామినేట్ థీమ్‌తో పోటీలు, వర్క్‌షాప్‌లు
- ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణంగా ఉంది: వీసీ వెంకటేశ్వరరావు

కానూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇన్నోవేట్, ఆటోమేట్, డామినేట్ థీమ్‌లతో రోబో ఎక్స్-2025 పేరుతో జరిగే జాతీయ రోబోటిక్స్ చాలెంజ్ పోటీలకు కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీ ఆతిథ్యం ఇస్తోంది. ఈనెల 18, 19న గురు, శుక్రవారం రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు దేశంలోని పలు ఇంజనీరింగ్ కళాశాల నుంచి 400 మంది వరకు విద్యార్థులు హాజరుకానున్నారు. రోబో వారియర్స్, పాత్‌ఫైండర్, చాలెంజ్, ప్రిసిషన్ పిక్ అండ్ ప్లేస్, ఇండస్ట్రీ 4.0 ఆటోమేషన్, అగ్రిబాట్ చాలెంజ్, మిషన్ రెస్క్యూ వంటి ఆరు విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. అదనంగా పరిశ్రమ నిపుణులతో రోబోటిక్స్ వర్క్‌షాపులు నిర్వహిస్తారు. వర్సిటీలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పోటీలు జరుగుతున్నాయి. విజేతలకు రూ.2లక్షలు వరకు బహుమతులు ఇవ్వనున్నారు.

విద్యార్థుల ప్రాక్టికల్ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయి
డాక్టర్ ఎన్ రవికుమార్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి

రోబో ఎక్స్-2025 పేరుతో జరిగే జాతీయ రోబోటిక్స్ చాలెంజ్ పోటీలకు హాజరుకావడం వల్ల విద్యార్థుల ప్రాక్టికల్ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయి. నిజజీవిత సవాళ్లకు సిద్ధం చేసుకోవడంలో ఈ పోటీలు దోహదకారి అవుతాయి. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన ఇంజనీర్లను ఒకే వేదికపైకి తీసుకురావచ్చు.

ఆవిష్కరణలకు రోబో ఎక్స్ ప్రోత్సాహం
ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, వీసీ, సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీ

విద్యార్థుల ఆవిష్కరణలకు రోబో ఎక్స్- 2025 జాతీయ పోటీలు ప్రోత్సాహకంగా ఉంటాయి. విద్యార్థులు స్మార్ట్ ఆటోమేషన్ భవిష్యత్‌ను నిర్మించేందుకు ప్రేరేపిస్తుంది. విద్యార్థుల సృజనాత్మకతను, జట్టు భావాల పెంచడంలో పోటీలు తోడ్పాటునందిస్తాయి.






బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140 , 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

సెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన

తోట్లవల్లూరు, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ నేత పి. నాగబాబు డిమాండ్ చేశారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎం రాకేష్, బి హరి ప్రసాద్, వి ప్రసాద్ ప్ల కార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అక్టోబర్ 12వ తేదీన విజయవాడ ఎంబీకే విజ్ఞాన కేంద్రంలో దశాబ్ద ఐక్యత భవిష్యత్తు పోరాట సభ జరుగనుందని ఆయన తెలిపారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

గుడివాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాలలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సేవా పక్వాడా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిప్రసాద్ రక్తదానం చేశారు. కోదండరామయ్య, కె.కె.డి ప్రసాద్,శ్రీధర్ కిరణ్ పాల్గొన్నారు.

స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని రోగులకు పండ్లు అందజేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీరాజబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జోన్స్, పాల్గొన్నారు.

పంచాయతియా .. డంపింగ్ యార్డా..!

● నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

● చెత్తతో నిండిన పంచాయతీ పరిసరాలు

(పమిడిముక్కల - ఆంధ్రజ్యోతి): పమిడిముక్కల గ్రామపంచాయతీ కార్యాలయం పరిసరాలు చెత్తకుప్పలతో డంపింగ్ యార్డులా తయారైంది. గ్రామంలో రోడ్లు శుభ్రపరచి, ఇళ్లనుంచి సేకరించిన చెత్త తీసుకువచ్చి గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో ఊరసంత జరిగే ప్రదేశంలో పడేస్తున్నారు. దీంతో ఈ ప్రదేశంలో ప్రతి గురువారం నిర్వహించే ఊర సంతకు బదులుగా చెత్తడంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. కొంతకాలంగా సంతకు ఉపయోగించే ప్రదేశంలో చెత్తకుప్పలు పోసి డంపింగ్‌యార్డులా తయారు చేయగా అక్కడ సంత నిర్వహించకుండా రోడ్లమీద పెడుతున్నారు. చెత్తనుంచి సంపద తయారుచేసేందుకు పమిడిముక్కలలో ఖాళీ ప్రదేశంలో ఏర్పాటుచేసిన సంపదకేంద్రం నిరుపయోగంగా ఉండి శిథిలావస్థకు చేరుకుంది. గ్రామపంచాయతీకి ఫుల్‌టైమ్ కార్యదర్శి లేకపోవడంతో పక్కగ్రామమైన కృష్ణాపురం పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు.

చెత్తవేయకుండా చర్యలు తీసుకుంటాం

గ్రామపంచాయతీ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెత్త డంపింగ్ చేయకుండా చర్యలుతీసుకుంటాము. చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం ఉపయోగించేలా తగిన చర్యలు చేపడతాం.

సీతారామరాజు, ఎంపీడీవో



నిరుపయోగంగా పమిడిముక్కల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



డంపింగ్ యార్డులా ఉపయోగిస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయ పరిసరాలు

గుడివాడ డీఎల్‌డీవోగా సునీతా శర్మ

గుడివాడ రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుడివాడ డివిజన్ డీఎల్‌డీవోగా సునీతా శర్మ బుధవారం డీఎల్‌డీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఎంపీడీవోగా పని చేస్తున్నారు. పదోన్నతిపై గుడివాడ డీఎల్‌డీవోగా వచ్చారు. ఈమెకు పలువురు అభినందనలు తెలియజేశారు.

గ్రామాల అభివృద్ధికి అధికారుల సమష్టి కృషి తప్పనిసరి

● ఎంపీపీ గద్దె పుష్పరాణి

గుడివాడ రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ఏజెండాగా పని చేయాలన్నారు. గ్రామాల్లో ఏ కార్యక్రమాలు జరిగిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాలని ఎంఈవో-1, ఎంఈవో-2లకు సూచించారు. ఏవో అనంతలక్ష్మీ మాట్లాడుతూ యూరియాఅందరికీ సమానంగా అందజేశామని తెలిపారు. శేరిగొల్వేపల్లి ఎంపీటీసీ అంగడాల రామాంజనేయులు మాట్లాడుతూ కొంతమంది మండలంలో సంవత్సరాల తరబడి ఇక్కడే ఉంటున్నారని, పది సంవత్సరాలు దాటినా వెళ్లటం లేదని తెలిపారు. ఎంపీపీ గద్దే పుష్పరాణి స్పందించి ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాలని ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్‌ను ఆదేశించారు. జడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ మాట్లాడుతూ కల్వపూడి అగ్రహారంలో నూతన రోడ్డు వేయమటానికి స్తంభం అడ్డంకిగా ఉందని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించాలని కోరారు. ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పుష్పరాణి

ఆధునిక పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధ్యం

● ఏడీఏ బి. స్వర్ణలత

పామర్రు, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): రైతులు కేవలం ఒకటి,రెండు పంటల సాగుమీద ఆధారపడకుండా, ఇతర పంటల సాగుపై దృష్టి సారించాలని పామర్రు వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ సహాయ సంచాలకురాలు బి స్వర్ణలత అన్నారు. మండల పరిధిలోని కొమరవోలు, జమీగోల్వేపల్లి గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సమీకృత వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన స్వర్ణలత మాట్లాడుతూ, రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా సాగులో ఖర్చులు తగ్గించుకోవచ్చునన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు మక్కువ చూపే విధంగా వీఏఏలు ప్రోత్సాహించాలన్నారు. మండల వ్యవసాయాధికారి వి.శివనాగరాణి మాట్లాడుతూ, అంతరపంటల సాగు విధానాలు రైతులకు వివరించి, అవలంభించాలని కోరారు. పంటచేల గట్ల మీద పండ్ల మొక్కలు, కూరగాయలు, పెరటి మొక్కల పెంపకం ద్వారా రైతులు లాభాలు ఆర్జించవచ్చన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఈనెలాఖరులోగా ప్రతిరైతూ పంటనమోదు చేయించుకోవాలన్నారు. అక్కడక్కడ పంటపై ఆకుమచ్చ తెగుళ్లు కనిపిస్తుందని, దాని నివారణ చర్యలను వివరించారు. సంబంధిత వీఏఏలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి స్వర్ణలత

పేద వర్గాలకు భరోసా సీఎం సహాయనిధి

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేద వర్గాలకు భరోసాగా సీఎం సహాయ నిధి పథకం నిలుస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వ, పెదపూడి, కూచిపూడి, కాజ, భట్లపెనుమర్రు గ్రామాలకు చెందిన 8మంది లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు, తాతినేని పూర్ణచంద్రరావు, వీరంకి తులసీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల : పమిడిముక్కల మండల పరిధిలో 7 గ్రామాలకు చెందిన 7గురు లబ్ధిదారులకు వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన సుమారు రూ.4.20లక్షల చెక్కులు బుధవారం అందజేశారు. కపిలేశ్వరపురానికి ,చెందిన కాసుల ఓంకార్‌కు బ్యాటరీ చార్జింగ్ ట్రైసైకిల్ ఎమ్మెల్యే అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, బాబూరావు, బాబి, శివనాగేశ్వరరావు స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

గుడ్లవల్లేరు మాజీ సర్పంచ్‌కు మాతృ వియోగం

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ పశువుల సంత , గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు, గుడ్లవల్లేరు మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి మాతృమూర్తి వల్లభనేని బేబి సరోజని బుధవారం ఉదయం మృతి చెందారు. కాగా కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు ఆమె నేత్రాలను దానం చేశారు. గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ ఎల్.వి ప్రసాద్ ఐ హాస్పటల్ వైద్య బృందం ఆమె కార్నియాను సేకరించారు. ఆమె అంతిమయాత్ర గురువారం ఉదమం 8 గంటలకు స్వగృహం నుంచి ప్రారంభం కానుందని కుటుంబసభ్యులు తెలిపారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బాపయ్య చౌదరి, గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రావు, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రవికుమార్, గద్దె అనూరాధ , సంతకమిటీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు, గుడ్లవల్లేరు పీఏసీఎస్ అధ్యక్షుడు నాగేశ్వరరావు సంతాపం తెలిపారు.



సుబ్బారావు చౌదరిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాము,రావి

ఫ్యాన్లు వితరణ

గుడివాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక నాగవరప్పాడులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పల్లపోతు నాగబాబు వితరణతో రెండు సీలింగ్‌ఫ్యాన్‌లను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎంఈవో సీహెచ్ రజిని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తాతారావు, మునీంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ నూర్జాహాన్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు నేడు

గుడివాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వర స్వామి దేవస్థాన హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం ఈ నెల 18వ తేదీన దేవ స్థాన ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థాన అభివృద్ధికి బుధవారం పెసరమిల్లికి చెందిన అల్లూరి రామశాస్త్రులు, లలితాదేవి దంపతులు రూ.25,116లు విరాళంగా దేవస్థాన కమిటీ చైర్మన్ సాయన రాజేష్‌కు అందజేశారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న బండి రామకృష్ణ

రైతుల సంక్షేమానికి కృషి చేస్తా

●డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. మంగళవారం రాత్రి విన్నకోట పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ ప్రమాణస్వీకారం నిర్వహించారు. చైర్మన్‌గా బండి రామకృష్ణ, సభ్యులుగా పేర్ని యేసుకుమార్(విన్నకోట), వీరంకి శ్రీవెంకట సత్యనారాయణ(పురిటిపాడు)లతో రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించారు. జనసేన గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రవికుమార్ , తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

పామర్రు,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి):అతి చిన్న వయస్సులో అనారోగ్యంతో విద్యార్థిని మృతి చెందడం బాధాకరమైన విషయమని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. ఇటీవల పెదమద్దాలిలో తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థిని లావణ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేవర్ల కుమార్‌రాజా బుధవారం విద్యార్థిని ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. లావణ్య తల్లిదండ్రులను ఎమ్మెల్యే పరామర్శించి, కొంత ఆర్థిక సాయం అందించారు. పెదమద్దాలి పీఏసీఎస్ అధ్యక్షుడు రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

కూచిపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మొవ్వ జడ్పీ పాఠశాలలో మండల స్థాయి అండర్-14, అండర్-17 బాలుర విభాగంలో క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంఈవో భానుప్రకాష్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ప్రారంభించారు. బాల్ బ్యాడ్మింటన్, ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, అథ్లెటిక్స్ అంశాలకు సంబంధించి ఎంపిక ప్రక్రియ జరిగింది. హెచ్ఎం ఉమాశ్రీ, ఎస్ఎంసీ చైర్మన్ గురువిందపల్లి బాబురావు, స్టాఫ్ సెక్రటరీ కోటేశ్వరరావు, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తప్పనిసరి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి

పామర్రు, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పలు వ్యాధులు దూరమవుతాయని పామర్రు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. ఎనిమిదవ రాష్ట్రీయ పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పెదమద్దాలి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారుల తల్లులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. మాత, శిశు మరణాలు తగ్గించేందుకు అంగన్వాడి సిబ్బంది తీసుకోవాల్సిన పలు అంశాలను తెలియజేశారు. బల్లిపర్రు గ్రామ సర్పంచ్ సుధాకర్, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పమిడిముక్కల: ముళ్లపూడి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమంలో భాగంగా సుపోషిత్ భారత్, సక్షం భారత్ నిర్వహించి స్థూలకాయ నివారణ, విద్య, చిన్న పిల్లల ఆహారపు అలవాట్లు, పిల్లలకు వండే ఆహార పదార్థాలపై అంగన్వాడీ కార్యకర్త ప్రేమలత, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు.

పెదపారుపూడి : తల్లిపాలే బిడ్డకు అన్ని రకాల పోషకాలను అందిస్తాయని అంగన్వాడీ సూపర్‌వైజర్ శివనాగమణి తెలియజేశారు. పోషకాహారం మాసోత్సవాల కార్యక్రమం బుధవారం వెంట్రప్రగడ, పెదపారుపూడి గ్రామాల్లో అరుణ కుమారి అధ్యక్షతన జరిగాయి. అంగన్వాడీ కార్యకర్తలు రజని, జేజి, భవాని, సుశీల కుమారి, ఆయాలు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో జమా మసీదు సెంటర్ అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా బుధవారం సుపోషిత్ భారత్ కార్యక్రమం నిర్వహించి గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన ఆరోగ్య సంరక్షణ జాగ్రత్తలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె మల్లేశ్వరి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విజయకుమారి

ఓపెన్ చెస్ పోటీల్లో కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక త్రివేణి పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన అండర్-20 ఓపెన్ చెస్ పోటీల్లో స్థానిక డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలను సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ కె.జ్యోతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు. పతకాలు సాధించిన విద్యార్థులు, కోచ్ స్వర్ణలతలను పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, లక్ష్మీప్రసాద్, ప్రశాంతి, ఉపాధ్యాయులు, అభినందించారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలు 21న

గుడివాడ : 2025-26 క్రీడా ప్రణాళికలో భాగంగా ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ఎన్టీఆర్ మెమోరియల్ ఉమ్మడి కృష్ణాజిల్లాల ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురషులు, స్త్రీలకు నిర్వహించే వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉమ్మడిజిల్లాల నుంచి అందరూ పాల్గొనవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు స్టేడియం వెయిట్ లిఫ్టింగ్ కోచ్ సెల్ 85220 99995కు సంప్రదించవచ్చునని యలవర్తి పేర్కొన్నారు. కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీవి అసత్య ఆరోపణలు

పెదపారుపూడి: పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి కలపాల కిషోర్ అన్నారు. బుధవారం యలమర్రులోని సూరపనేని వెంకట సత్యనారాయణ ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.


ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యమే కూటమి లక్ష్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

కూచిపూడి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యంగా పని చేస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. స్వస్థ్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని మొవ్వ పీహెచ్‌సీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబంలో మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పీటీసీ పార్వతీ, ఏఎంసీ చైర్మన్ శివరామయ్య, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీవో సుహాసిని, పాల్గొన్నారు.



బిళ్లపాడులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

పమిడిముక్కల : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కపిలేశ్వరపురం ఆయుష్ ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించి 155 మంది కిశోర బాలికలు, మహిళలకు వైద్యపరీక్షలు చేశారు. సర్పంచ్ బి.నాగమణి, మాజీ వైస్ ఎంపీపీ బాబూరావు, బాబి పాల్గొని స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ర్యాలీని ప్రారంభించారు. డాక్టర్ బాలాజీ , డాక్టర్ ఇందు, ఉపసర్పంచ్ జి. శివ రామకృష్ణ, టీడీపీ నాయకుడు జగదీశ్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.


గుడివాడ : ప్రతి కుటుంబంలో మహిళ ఆరోగ్యంగాఉంటే ఆకుటుంబం శక్తివంతంగా ఉంటుందని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జాన్ డేవిడ్ ట్విన్‌సన్ అన్నారు. బుధవారం స్థానిక 13వవార్డు బాపూజీనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్రం ప్రవేశపెట్టిన "స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్" అభియాన్ పథకంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ 13వ వార్డు ఇన్‌చార్జ్ కనకాంబరం, మేరుగు మోజెస్, డాక్టర్ సురేష్, సీడీపీవో విజయఫ్లారెన్స్, హెల్త్ సెంటర్ ఆర్గనైజర్ వి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : బిళ్లపాడు సబ్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారి - సశక్త్ పరివార్ సంబంధించి బ్రోచర్‌ను మోటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దీప్తి ఆవిష్కరించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : దేవరపల్లిలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ వైద్య శిబిరం నిర్వహించారు. జీవనశైలిలో స్త్రీ పాత్రపైన, గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య భద్రత తదితర అంశాలపై పీహెచ్‌సీ డాక్టర్ మాధవి అవగాహన కల్పించారు. జడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు , సీహెచ్‌వో సోనిక, 104 సిబ్బంది పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది



దేవరపల్లిలోని వైద్య శిబిరంలో పాల్గొన్న జడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వరరావు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

స్పెషల్ బస్సుల్లో
విశ్రాంత కార్మికులకు ఉచిత ప్రయాణం కల్పించాలి

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లికి వెళ్లే స్పెషల్ బస్సుల్లో ఆర్టీసీ విశ్రాంత కార్మికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును టీఎస్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండలి వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన ఎండీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఎండీ సానుకూలంగా స్పందించారని వెంకటేశ్వరరావు తెలిపారు.

వరద తగ్గుముఖం

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలవుతున్న వరద తగ్గుముఖం పట్టిందని ఇరిగేషన్ డీఈ గణపతిరావు బుధవారం తెలిపారు. నీటి మట్టం బుధవారం 1.77 లక్షల క్యూసెక్కులకు చేరిందని ఆయన పేర్కొన్నారు.

24న మండల సమావేశం

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ తుంగల సుమతి అధ్యక్షతన ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో మరియకుమారి తెలిపారు. జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయం

● స్వస్థ నారీ- సశక్త్ పరివార్ ప్రారంభ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్



అవనిగడ్డ ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, బంటుమిల్లి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

అవనిగడ్డ/బంటుమిల్లి/ఘంటసాల/గూడూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా స్వస్థ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని అవనిగడ్డ ఏరియా ఆస్పత్రిలో మండలి బుద్ధప్రసాద్, బంటుమిల్లి పీహెచ్‌సీలో కాగిత కృష్ణప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 15 రోజులపాటు పత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి వివిధ రకాల పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవనిగడ్డలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ జయకుమార్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ సుమచౌదరి, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి పాల్గొన్నారు. బంటుమిల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు వీరబాబు, వైద్యాధికారి పవన్‌కుమార్, డాక్టర్ సౌందర్య, సుజ్ఞానం సతీష్, ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసీరావు, పీఏసీఎస్ అధ్యక్షులు ఇల్లూరి లీలాకృష్ణ, గంధం సత్యనారాయణ, ర్యాలీ సత్యనారాయణ, మాగంటి గంగరాజు, సీడీపీవో సముద్రవేణి పాల్గొన్నారు. శ్రీకాకుళం పీహెచ్‌సీలో స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ ప్రారంభించారు. 15 రోజులు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తామని, మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని తెలిపారు. ఉపసర్పంచ్ శీలం శ్రీనివాస్, కూటమి నేతలు దాసం రామకృష్ణ, కొండవీటి నాని, కోటి, గాదె వెంకటేశ్వరరావు, డాక్టర్లు అనిత, సాయి శరణ్య పాల్గొన్నారు. గూడూరు మండలం తుమ్మలపాలెంలో కార్యక్రమాన్ని మల్లవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి తరుణ్‌శంకర్, సర్పంచ్ కోడే రేణుకాదేవి, టీడీపీ నేత తోట వేణు ప్రారంభించారు. 14 రకాల వైద్య పరీక్షలు చేశారు. 0-5 సంవత్సరాల పిల్లలకు టీకాలు వేశారు. 104 వాహనం ద్వారా 90 మందికి మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యదర్శి మణి, ఎంపీహెచ్‌ఈవో వీరయ్య, హెచ్‌వీ సరళ పాల్గొన్నారు.

రూ.130 కోట్లతో డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి

● ప్రణాళికలు సిద్ధం చేశాం: మంత్రి కొల్లు రవీంద్ర



సబ్‌జైలు వద్ద డ్రెయిన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షం వచ్చినప్పుడు రోడ్లపై నీరు నిల్వకుండా మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు రూ.130 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బుధవారం సబ్‌జైలు, జిల్లా కోర్టు సెంటర్ ప్రాంతాల్లో రూ. 67.57 లక్షల వ్యయంతో చేపట్టిన మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. చాలాకాలంగా జిల్లా జైలులో మురుగునీటి సమస్య ఉందని, పరిష్కరించేందుకు డ్రెయిన్ నిర్మాణం చేపట్టామని ఆయన తెలిపారు. సీఎం చంద్రబాబు నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో మురుగునీటి వ్యవస్థలో వచ్చే ఇబ్బందులను కలెక్టర్ బాలాజీ తెలిపారని, సీఎం మొదటి దశలో రూ.13 కోట్లు విడుదల చేశారని తెలిపారు. మిగిలిన రూ.117 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వీధి దీపాలు, పారిశుధ్యం, రహదారుల నిర్మాణంపై దృష్టి సారిస్తున్నామన్నారు. జైళ్ల డీఐజీ వరప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, సబ్ జైలు సూపరింటెండెంట్ రమేష్, కార్పొరేటర్ దేవరపల్లి అనిత, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, నేతలు గొర్రెపాటి గోపీచంద్, రొండి కృష్ణయాదవ్, మోటమర్రి బాబాప్రసాద్, పి.వి.ఫణికుమార్, లోగిశెట్టి వెంకటస్వామి, హసీంబేగ్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు పంపిణీ

మచిలీపట్నం టౌన్: నగరంలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో పారిశుధ్య కార్మికులకు రూ.6 లక్షల విలువైన కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు, సంచులను మంత్రి పంపిణీ చేశారు. రోజూ 70 టన్నుల చెత్తను కార్మికులు సేకరిస్తున్నారన్నారు. మునిసిపాలిటీలో పాలకవర్గం బడ్జెట్ ప్రతిపాదించలేదని, ప్రభుత్వం ప్రతిపాదించిందని తెలిపారు. మురుగునీటిని శుద్ధి చేసి శుద్ధ జలంగా మార్చే సీవరేజ్ ప్లాంట్లకు రూ.73 కోట్లు మంజూరయితే టెండర్లు పిలిచామని, సరైన టెండర్లు రాకపోవడంతో రద్దు చేశామని తెలిపారు. మళ్లీ టెండర్లు పిలుస్తామన్నారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు పాల్గొన్నారు. **పెడన:** మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు కన్జర్వెన్సీ సామాన్లు పంపిణీ చేశారు. కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మాజీ కౌన్సిలర్ బెజవాడ నాగరాజు, ఏఈ రామాంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం



మండల సమావేశంలో సమస్యలు ప్రస్తావిస్తున్న పాగోలు ఎంపీటీసీ సభ్యుడు మేకా బంగారుబాబు

చల్లపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ కోట విజయ రాధిక అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సమావేశం వాడీవేడిగా సాగింది. మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, పాగోలు ఎంపీటీసీ సభ్యుడు మేకా బంగారుబాబు, మాజేరు ఎంపీటీసీ సభ్యురాలు తమ్ము లక్ష్మి పలు సమస్యలు ప్రస్తావించారు. మండల పరిషత్ నిధులతో పాగోలులో డ్రెయినేజీల నిర్మాణానికి వర్క్స్‌కమిటీ తీర్మానం ఇచ్చినా వర్క్ ఆర్డర్లు ఎందుకివ్వలేదని ఎంపీటీసీ మేకా బంగారుబాబు ప్రశ్నించారు. ఏ పనికీ వర్క్‌ఆర్డర్ ఇవ్వలేదని, ఎన్నోసార్లు కార్యాలయానికి తిరిగానని, అధికారుల పనితీరు సరిగాలేదని ఆయన అన్నారు. మంగళాపురంలో జరిగిన జలజీవన్ మిషన్ పనుల్లో లోపాలున్నాయని, పైపులైను లీకులు వస్తున్నాయని సర్పంచ్ డొక్కు నాగేశ్వరరా వు ఫిర్యాదుచేశారు. కాంట్రాక్టర్ పనులు సరిగాచేయలేదని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. వృద్ధులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ సరఫరా చేయటంలేదని ఫిర్యాదుచేశారు. మాజేరు పల్లెపాలెంలో అంగన్వాడీ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని, అద్దెభవనంలో కేంద్రం నడుస్తోందని, అంగన్వాడీకి వచ్చే పిల్లల సంఖ్య తగ్గిపోతోందని ఎంపీటీసీ తమ్ము లక్ష్మి ప్రస్తావించారు. అధికారులు నిబంధనల మేరకు నడుచుకోవాలని, పనులు ఆగటానికి వీల్లేదని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ సూచించారు. తహసీల్దార్ డి.వనజాక్షి, సర్పంచ్ పైడిపాము ల కృష్ణకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో అతావుల్లా, ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ నందకిషోర్, సీడీపీవో ప్రస న్న విశ్వనాథ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి

కోడూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ, పంచాయతీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మూడు నెలల్లో మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఎండీవో సుధా ప్రవీణ్ వివరించారు. జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు బడే హేమగంగాధర్‌రావు, లంకే భాస్కరరావు, పరిశె అనసూయ, సర్పంచ్‌లు కనగాల వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి దుర్గ, ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే



జ్వర బాధితులతో మాట్లాడుతున్న వైద్యులు

కృత్తివెన్ను, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపురం పల్లెపాలెం గ్రామంలో జ్వర పీడితుల సంఖ్య పెరగడంపై లక్ష్మీపురం పీహెచ్‌సీ వైద్యులు ఆరా తీశారు. బుధవారం సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. వారితో మాట్లాడి, వైద్య సేవలందించారు. గ్రామంలో తాగునీటి శ్యాంపిళ్లను సేకరించి, పరీక్షల నిమిత్తం మచిలీపట్నం ల్యాబ్‌కు పంపారు. జ్వరాలు వ్యాపించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తాగునీటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. వైద్యులు హీనా, సంతోష్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకూ సాగు నీరందిస్తాం

● డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు

కృత్తివెన్ను, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాలకూ సాగునీటిని పూర్తిస్థాయిలో అందిస్తామని డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు, ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం చినగొల్లపాలెం సబ్‌చానల్‌ను శివారు వరకు వెళ్లి వారు పరిశీలించారు. దిగువకు సాగునీరు పూర్తిస్థాయిలో చేరటం లేదని, కాలువల్లో ఉప్పు నీరు చేరుతోందని రైతులు చెప్పడంతో కాలువ చివరి వరకు వెళ్లి, నీటి మట్టాలను పరిశీలించి, కాలువలో నీటిని రుచి చూశారు. దిగువకు సాగు నీరు చేరుతోందని అది కాలువ నీరేనని రైతులు నిర్భయంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. రైతులతో మాట్లాడి, వారి సమస్యలపై ఆరా తీశారు. నీటి మట్టాన్ని పెంచి చివరి వరకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని రైతులకు వివరించారు. డీసీ వైస్ చైర్మన్ బొర్రా ఏడుకొండలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

అవనిగడ్డ/పెడన/గూడూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం, పెడన తోటమూల హైస్కూల్, గూడూరు హైస్కూల్‌లో మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. అవనిగడ్డలో ఎంపీపీ తుంగల సుమతీదేవి పోటీలను ప్రారంభించారు. హెచ్ఎం కె.సుజాత, వ్యాయామోపాధ్యాయులు ఎస్.వీరకుమార్, ఎం.ఉదయకుమార్, సనకా శ్రీకాంత్ పర్యవేక్షించారు. పెడన తోటమూల హైస్కూల్‌లో అండర్-14, 17 బాలబాలికల ఆటల పోటీలను హెచ్ఎం చింతలపాటి నాగేశ్వరరావుతో కలిసి ఎంఈవో-2 వై.వి. హరనాథ్ ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, చెస్, యోగా పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా పోటీలకు ఎంపిక చేశామని హరనాథ్ తెలిపారు. గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం జి.విజయకుమారి స్కూల్ గేమ్స్ మండల ఇన్‌చార్జి పీడీ చిలుకోటి రాజేష్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభించారు.

డివిజన్ పోటీలకు 44 మంది ఎంపిక

నాగాయలంక: స్కూల్ గేమ్స్ మచిలీపట్నం డివిజన్ స్థాయి పోటీలకు మండలంలో నుంచి 44 మందిని ఎంపిక చేశామని పీడీ గాజుల లక్ష్మీప్రసాద్ తెలిపారు. మండల స్థాయిలో నాగాయలంక జడ్పీ పాఠశాలలో నిర్వహించిన ఆటలు పోటీలు ముగిశాయని, తలగడదీవి, భావదేవరపల్లి, ఏటిమొగ, ఎదురుమొండి జడ్పీ పాఠశాలల నుంచి 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 200 మంది పాల్గొన్నారని ఆయన తెలిపారు. వీరిలో అత్యంత ప్రతిభ కనబర్చిన బాలురు 23, బాలికలు 21 మందిని డివిజన్ డివిజన్ ఆటల పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు.

బందరులో చెస్ పోటీలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో బుధవారం స్టార్ స్కూల్ ఆవరణలో చెస్ పోటీలు నిర్వహించారు. అండర్-14 బాలుర పోటీల్లో ఎన్.సాయిప్రీతమ్ ప్రథమ, అండర్ 17 బాలురలో వి.యశ్వంత్ 3వ స్థానంలో నిలిచాడు. అండర్ 14 బాలికల పోటీల్లో పి.జస్రిత ద్వితీయ, అండర్ 17 బాలికల పోటీల్లో పి.హర్షిత ప్రథమ, వర్షిత ద్వితీయ స్థానంలో నిలిచారు.

ఘనంగా పెరియార్ జయంతి

అవనిగడ్డ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెరియార్ రామస్వామి నాయకర్ జయంతిని బుధవారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పెరియార్ రామస్వామి చిత్రపటానికి పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు నివాళులర్పించారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు పరుచూరి దుర్గాప్రసాద్, మండలి రామ్మోహనరావు, ఘంటసాల రాజమోహనరావు, బండే కనకదుర్గ, బండే రాఘవ, మాదివాడ రత్నారావు పాల్గొన్నారు.

బీజేపీ నేత భోగాది వెంకటేశ్వరరావుకు నివాళి

నాగాయలంక, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత, పర్రచివర మాజీ సర్పంచ్ భోగాది వెంకటేశ్వరరావు మృతి చెందారు. బుధవారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు పర్రచివరకి వచ్చి భోగాది మృతదేహానికి నివాళులర్పించారు. భోగాది వెంకటేశ్వరరావు భౌతిక కాయానికి పార్టీ జెండా కప్పి బీజేపీ రాష్ట్ర నాయకురాలు భోగాది రమాదేవి, గుడివాక శివాజీ, తుంగల మురళీకృష్ణ, లతామోహన్, బండ్రెడ్డి బోసు నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, మండలి ఉదయభాస్కర్, మాదివాడ అర్జునరావు నివాళులర్పించారు.

మార్గదర్శకుల సహకారంతో పేదరిక నిర్మూలన

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమం కింద బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని, మార్గదర్శుల సహకారంతో పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టామని అర్థగణాంక అసిస్టెంట్ డైరెక్టర్ రోహిణి తెలిపారు. బుధవారం జడ్పీ సమావేశపు హాలులో పీ-4 కింద పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, జిల్లా సీఈవో భీమరాజు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదినోత్సవం



అవనిగడ్డలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నేతలు

అవనిగడ్డ/కోడూరు/చల్లపల్లి/పెడన/కృత్తివెన్ను, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బుధవారం బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డలో మోదీ జన్మదిన వేడుకలు, విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, మట్టా ప్రసాద్, జి.వి.నగరాయులు, గుండాబత్తిన గీతాకృష్ణ, బచ్చు విజయలక్ష్మి, పి.ప్రభాకర్, కె.రమేష్, యార్లగడ్డ రామకృష్ణ తదితరులు కేక్ కట్ చేశారు. కోడూరు ప్రధాన సెంటర్‌లో బీజేపీ జెండా దిమ్మె వద్ద పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండవీటి రామకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్వతంత్రపురంలోని ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. దొండపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి దేవరకొండ సుబ్బారావు, విశ్వనాథపల్లి వేణు పాల్గొన్నారు. పెడనలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మామిడి లక్ష్మీనారాయణ గుప్తా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బంగ్లా స్కూల్‌లో విద్యార్థులకు పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు కొల్లూరి రాధాకృష్ణగుప్తా, కట్టా జ్యోతీశ్వరరావు, కొత్త మురళీకృష్ణ, గోపాలం సూర్యనారాయణ పాల్గొన్నారు. చల్లపల్లి ప్రధాన సెంటర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు పిండి రేవతి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు పాల్గొన్నారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో కృత్తివెన్ను శీతనపల్లి ప్రధాన సెంటర్‌లో కేక్‌ను కట్‌చేసి, స్వీట్లను పంచారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంచారు. బీజేపీ నేతలు దాసరి శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ ఏసురాజు, టీడీపీ నాయకులు నెక్కంటి భాస్కరరావు, పిన్నెంటి రత్తయ్య పాల్గొన్నారు.



పీఏసీఎస్ త్రిసభ్య కమిటీకి అభినందనలు తెలుపుతున్న కనపర్తి శ్రీనివాసరావు, మండలి వెంకట్రామ్

మేళ్లమర్తిలంక పీఏసీఎస్
త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకారం

మోపిదేవి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల సంఖ్యను పెంచి మేళ్లమర్తిలంక పీఏసీఎస్ మరింత అభివృద్ధి చెందేలా త్రిసభ్య కమిటీ పని చేయాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ సూచించారు. బుధవారం మేళ్లమర్తిలంక పీఏసీఎస్ తిసభ్య కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. చైర్మన్‌గా నాగినేని ధనుంజయరావు, సభ్యులుగా తోట శరత్‌బాబు, మోర్ల వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో పీఏసీఎస్‌లను నష్టాల బాటలో నడిపారని, ప్రస్తుతం బాధ్యతలు స్వీకరించిన త్రిసభ్య కమిటీలు లాభాల బాటలో పయనించేలా చూడాలని సూచించారు. టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు, పూషడపు రత్నగోపాల్, ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, టీడీపీ నాయకులు రావి నాగేశ్వరరావు, యార్లగడ్డ సోమశేఖరప్రసాద్ పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు అవగాహనా సదస్సు

పెడన రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలు పొదుపు, రుణాల చెల్లింపులు వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రభుత్వం మన డబ్బులు-మన లెక్కలు పేరుతో నూతన విధానాన్ని ప్రవేశపెట్టిందని డీఆర్డీయే(వెలుగు) పీడీ హరహరనాథ్ అన్నారు. బల్లిపర్రులో మన డబ్బులు-మనలెక్కలు అనే అంశంపై ఆయన అవగాహనా సదస్సు నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్ పాల్గొన్నారు.

చెరువు సర్వే చేయించి నివేదిక ఇవ్వండి

పెడన రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉరివి శివారు ప్రాంతమైన నరసప్పచెరువు గ్రామంలోని చెరువును సర్వేచేయించి నివేదిక ఇవ్వాలని అధికారులను డీఎల్డీవో పద్మావతి ఆదేశించారు. పక్కన ఉన్న తుమ్మిడి పంచాయతీకి హక్కులు ఉన్నాయని నాలుగేళ్లుగా పాటలు పెట్టకపోవటంతో పంచాయతీ ఆదాయం కోల్పోతుందని ఫిర్యాదు చేయడంతో ఆమె బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇరు గ్రామాల అధికారులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. సర్వే చేయించాక నివేదికను ఉన్నతాధికారులకు పంపి సమస్యను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఎండీవో అరుణకుమారి ఈవోఆర్డీ నాగిరెడ్డి, బంటుమిల్లి ఈవోఆర్డీ శైలజ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ ధ్వజాన్ని ఆవిష్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

చల్లపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద విశ్వకర్మ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ ధ్వజాన్ని ఆవిష్కరించి, విశ్వకర్మ భగవానుడి చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. విశ్వకర్మ జయంతి రోజును కేంద్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఈ సందర్భంగా నేతలు విజ్ఞప్తి చేశారు. విశ్రాంత ఎంపీడీవో ఓలేటి వెంకటరమణ, చల్లపల్లి ఎన్జీవో యూనిట్ నాయకులు పూసపాటి బ్రహ్మానందరా వు, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, జిల్లా మాజీ కోశాధికారి కేశనకు ర్తి శరత్‌బాబు, మండల అధ్యక్షుడు శామీరుపేట సాయిబాబు పాల్గొన్నారు. ● **అవనిగడ్డ:** విశ్వకర్మ జయంతి సందర్భంగా ఎల్ఐసీ కార్యాలయం వద్ద కార్మిక సంఘ నేత అద్దంకి సాంబశివరావు ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి వేడుకలు నిర్వహించారు.